# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 16, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం -15- మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


### బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని

## అప్పుల ఊబిలోకి నెట్టేసింది



2

- భారీ అప్పుల్లోనూ సంక్షేమానికి తడబాటులేదు
- గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదు

### ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం

## .. ఢిల్లీకి చంద్రబాబు, పవన్



- ప్రధాని మోదీ అధ్యక్షతన ఈ నెల 24 ఎన్డీఏ కీలక భేటీ
- ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలపై చర్చించే అవకాశం

2లో

## భారత ఓడరేవులో 21 మంది పాకిస్థానీలు..

- హైఅలర్ట్ ప్రకటించిన అధికారులు




- ఒడిశా లోని పారదీప్ పోర్టు కు వచ్చిన ఓ ఓడ కలకలం
- దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పారదీప్ పోర్టుకు
- ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కిలోమీటర్ల దూరంలోని 'పీఎం బెర్త్' వద్ద లంగర్ వేసి ఉంది




2

## శాంతిచర్చలకు మేం రెడీ.. మోడీ సర్కార్ సిద్ధమా?..

### మావోయిస్టుల సంచలన లేఖ

- మోడీ ప్రభుత్వం దీనికి అనుకూలంగా ఉందో లేదో స్పష్టం చేయాలి
- ప్రజా సమస్యలను పరిష్కరించడానికి, ఆపరేషన్ కగార్‌ను ఆపడానికి ముందుకు రండి
- శాంతి చర్చలు జరపడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడానికి ముందుకు రండి..

# నేను నిత్య విద్యార్థిని

## కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటా

- ప్రపంచం మొత్తం జీఎఫ్ఎస్‌టి గురించి చెప్పుకోవాలి
- 1995 నుంచి నేర్చుకుంటూనే ఉన్నా
- జీఎఫ్ఎస్‌టి సంస్థ 6 ఏళ్ల క్రితం ప్రారంభించాం
- ఆర్థిక సంస్కరణల వలన దేశం అభివృద్ధి చెందింది
- ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారని, వారిలో తెలుగు వాళ్లే అధికమం



విజయవాడ: విజయవాడలో పశు సంవర్ధక శాఖ టెక్ ఏఐ 2.0 కాంక్లేవ్‌లో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. నేను నిత్య విద్యార్థిని, ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటా. 1995 నుంచి నేర్చుకుంటూనే ఉన్నా. జీఎఫ్ఎస్‌టి సంస్థ 6 ఏళ్ల క్రితం ప్రారంభించాం. ఆర్థిక సంస్కరణల వలన దేశం అభివృద్ధి చెందింది. అప్పుడు ఫ్యామిలీ ప్లానింగ్ అని అన్నా..ఇప్పుడు పిల్లలు ఎక్కువ మంది కనాలి అంటున్నా.. ఎంట్రపెన్యూర్ ను ప్రోత్సహించాను. ప్రపంచం మొత్తం జీఎఫ్ఎస్‌టి గురించి చెప్పుకోవాలి...అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సాంకేతికత ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉందని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారని, వారిలో తెలుగు వాళ్లే అధికమన్నారు. ప్రపంచంలో యువత ఎక్కువగా ఉండేది భారత్ లోనే నని చెప్పారు. గతంలో ఏ పని చేయాలన్న ప్రభుత్వం మిగతా..2లో

### రూ. 22వేల కోట్లతో

## రెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్

- దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు 16న మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- ప్రజాప్రభుత్వంలో పెద్దఎత్తున తరలివస్తున్న పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు
- ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన రెన్యూ పవర్

అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ తో పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ఏపీకి క్యూకడుతున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం బేతపల్లిలో రెన్యూ సంస్థ రూ. 22వేల కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ పవర్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ భారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో మంత్రి లోకేశ్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా నడుమ జరిగిన వ్యూహాత్మక చర్చలు ఫలించడంతో ఆరేళ్ల తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రెన్యూ పవర్ ముందుకు వచ్చింది. రెన్యూ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా మిగతా..2లో







2

## గాజాలో దారుణం వైమానిక దాడిలో 48 మంది పౌరుల మృతి

- ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు, భారీ ప్రాణ నష్టం
- మృతుల్లో 22 మంది చిన్నారులు
- గాజాలో యుద్ధం ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధాని

## టర్కీ, చైనా మీడియా సంస్థల సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేసిన భారత్




2

- ఆపరేషన్ సిందూర్ పై అసత్య ప్రచారం
- తీవ్రంగా స్పందించిన భారత్

## రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల సమావేశం

- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, కట్టుదిట్టమైన చర్యలను ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రశంసం
- ఆపరేషన్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి సమర్పించారు

ఢిల్లీ: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ సహా త్రివిధ దళాధిపతులు భేటీ అయ్యారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంగా ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సైనిక ఉన్నతాధికారులు రాష్ట్రపతికి సమర్పించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, కట్టుదిట్టమైన చర్యలను ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు. ఈ భేటీపై రాష్ట్రపతి భవన్ ట్వీట్ "రక్షణ దళాల అధిపతి మిగతా..2లో



2

## ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం

- ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పారు
- గత 20 రోజుల్లో సీసీఎస్ భేటీ కావడం ఇది ఐదోసారి
- సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకున్నారు
- భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపిన తర్వాత సీసీఎస్‌తో ప్రధాని మోదీ భేటీ కావడం తొలిసారి



వివరాలు 2లో..

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ లో భాగంగా న్యూఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో హైలెవిల్ సీసీఎస్ సమావేశం జరిగింది. పలువురు కీలక కేబినెట్ మంత్రులతో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షాలు హాజరయ్యారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ తో పాక్ లోని ఉగ్రస్థావరాలను భారత్ నేలమట్టం చేసింది. ఈ క్రమంలోనే వరుసగా సీసీఎస్ సమావేశాలు నిర్వహిస్తున్నారు ప్రధాని మోదీ. గత 20 రోజుల్లో సీసీఎస్ భేటీ కావడం ఇది

## సీఐపై హైడ్రా కమిషనర్

# రంగనాథ్ ఆగ్రహం

- బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు ఎందుకు నమోదు చేయలేదు
- ప్లాట్లను కబ్జా చేశారని పలువురు బాధితులు హైడ్రాకు ఫిర్యాదు
- భూమిలో మారణాయుధాలు చూసి ఆగ్రహానికి లోనయ్యారు
- బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలి




వివరాలు 2లో..

హైదరాబాద్: బాధితులు ఫిర్యాదు చేసినా కేసులు ఎందుకు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్లాట్లను కబ్జా చేశారని పలువురు బాధితులు హైడ్రాకు ఫిర్యాదు మిగతా..2లో



## డీలర్లే రేషన్ మాఫియా అవతారం..



నగర్ లో ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం బియ్యానీ కి డీలర్ డబ్బులు ఇస్తూ ఉండగా క్రైమ్ నైన్ న్యూస్ ప్రతినిధులకు వారి కెమెరాలకు చిక్కినటువంటి వైనం ప్రశ్నించగా తడబాటు సమాధానంతో వాహనదారుడు తలుపులు బిగించుకొని హుటాహుటిన భయంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. విలేకరుల ప్రశ్నిస్తుండగా సమాధానం దాటవేస్తూ

గుంటూరు (జనం) రిపోర్టర్: గుంటూరు నగరపాలక సంస్థలోని రాజీవ్ గాంధీ నగర్ పరిధిలో రేషన్ డీలర్ ఎం డి యు వాహనం దారుడు రేషన్ బియ్యం కొనుగోలు చేసి రేషన్ మాఫీ అవతారం ఎత్తారు. కేజీ ?10 చొప్పున కొనుగోలు చేసి అక్రమదారులకు 30 రూపాయలు చొప్పున అమ్ముకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కడుపు నింపటానికి ఇస్తున్న బియ్యాన్ని పొట్టలు కొట్టి డీలర్లు అక్రమంగా లక్షల సంపాదిస్తున్నారు. ఒక పక్కన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యక్షంగా రేషన్ దళారీ వ్యవస్థ పై ,అక్రమంగా తరలించిన వారి పైన రేషన్ అమ్ముకుంటున్న వారి పైన క్రిమినల్ చర్యలు రౌడీషీట్లు తెరుస్తామని చెప్పినటువంటి ముఖ్యమంత్రి మాటలను పట్టించుకోకుండా దళారులు పెడచెవిన పెట్టి యదేచ్ఛగా రేషన్ తరలిస్తున్నారు.రాజీవ్ గాంధీ






చూపించమని లెక్కలు చూపించమంటే తడబాటుతో పరుగులు తీసిన వాహనదారుడు ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన ఆయన మాటలను లెక్కచేయకుండా పేదల కడుపు కొడుతున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా మాట్లాడిన వారం

రోజుల్లోనే గుంటూరు రాజీవ్ గాంధీ నగర్ లో ఉన్నటువంటి 148వ రేషన్ షాప్ డీలర్ షాప్ నిర్వహిస్తున్నటువంటి వారెవరని అడగగా లక్ష్మీ అని సమాధానంతో ముసలావిడ వయసు పెద్దదని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేసినటువంటి వాహనదారుడు, డీలర్ ఇద్దరు కలిసి పేదలకు అందించాల్సిన బియ్యాన్ని గుట్టు చప్పుడు కాకుండా వాహనదారులే డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తున్నటువంటి వైనం కొనుగోలు చేసినటువంటి బియ్యాన్ని దళారులకు ఎక్కువ మొత్తంలో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి రాజీవ్ గాంధీ నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యక్షమైంది.ఒక పక్కన పోలీసులు గాని జిల్లా కలెక్టర్ కానీ అక్కడ ఉన్నటువంటి అధికారులు కూడా పట్టించుకోకుండా పేదలకు అందవలసిన బియ్యాన్ని అక్రమంగా అర్ధరాత్రి సమయంలో జిల్లాలు దాటిస్తున్న రేషన్ మాఫియా ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది.లక్షల్లో సంపాదిస్తున్న ముడుపులను అధికారులకు చెల్లిస్తున్నట్టు ప్రజలు చెప్పుకుంటున్నారు . నెల మామూళ్లు గుట్టుచప్పుడు కాకుండా అధికారులకు చేరవేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత శాఖల అధికారులు రేషన్ మాఫియా పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక
గురువారం - 15 - మే - 2025

## గాజాలో దారుణం
# వైమానిక దాడిలో 48 మంది పౌరుల మృతి

ఇజ్రాయెల్-హమాస్: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న ఘర్షణలతో గాజా ప్రాంతం మరోసారి దాడులతో దద్దరిల్లుతోంది. ఉత్తర గాజాలోని నివాస ప్రాంతాలపై మంగళవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర గాజాలోని జబాలియా ప్రాంతంలో ఇళ్లపై వైమానిక దాడులు జరిగాయి. ఈ దుర్ఘటనలో 48 మంది పౌరులు మరణించగా, వారిలో 22 మంది చిన్నారులు ఉన్నారని స్థానిక ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అనేక నివాస భవనాలు ఈ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన ఒప్పందంలో భాగంగా హమాస్ ఒక ఇజ్రాయెల్-అమెరికన్ బందీని విడుదల చేసిన కొద్దిసేపటికే ఈ దాడులు జరగడం గమనార్హం.మరోవైపు, గాజాలో యుద్ధాన్ని ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. దీంతో యుద్ధ విరమణ ఒప్పందంపై నెలకొన్న ఆశలు సన్నగిల్లాయి. ఇటీవల ఇజ్రాయెల్‌పై హూతీలు జరిపిన దాడుల పట్ల నెతన్యాహు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హూతీలను కచ్చితంగా ఎదుర్కొంటామని, గతంలో ఐడీఎఫ్ చేసిన దాడులను వారు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈసారి దాడులు తీవ్రంగా ఉంటాయని, బాంబుల మోతలతో హోరెత్తిస్తామని ఆయన అన్నారు.

## టర్కీ, చైనా మీడియా సంస్థల
# సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేసిన భారత్

ఢిల్లీ: భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసిందన్న ఆరోపణలపై టర్కీ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రసార సంస్థ 'టీఆర్టీ వరల్డ్' ఎక్స్ ఖాతాను భారత ప్రభుత్వం బుధవారం నిలిపివేసింది. పాకిస్థాన్ ఉపయోగించిన టర్కీ నిర్మిత డ్రోన్లు భారత గగనతలంలోకి చొరబడినట్లు ఫోరెన్సిక్ నివేదికలు వెల్లడైన కొద్ది రోజులకే ఈ చర్య తీసుకోవడం గమనార్హం. పాకిస్థాన్ చేసిన చొరబాటు యత్నాన్ని భారత రక్షణ దళాలు తక్షణమే తిప్పికొట్టాయి, భారత భూభాగానికి ఎలాంటి నష్టం జరగకుండా చూసుకున్నాయి. అదే సమయంలో, చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా సంస్థలైన గ్లోబల్ టైమ్స్, జిన్హువాలకు చెందిన ఎక్స్ ఖాతాలను కూడా కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో భారత సైన్యం గురించి ధృవీకరించని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ఈ సంస్థలు వ్యాప్తి చేస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ఈ ఖాతాలను యాక్సెస్ చేయడానికి ప్రయత్నిస్తే, "ఖాతా నిలిపివేయబడింది. చట్టపరమైన డిమాండ్‌కు ప్రతిస్పందనగా @trtworld భారతదేశంలో నిలిపివేయబడింది" అనే సందేశం కనిపిస్తోంది. 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్తాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ కచ్చితమైన వైమానిక దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ దాడుల అనంతరం టీఆర్టీ వరల్డ్ తప్పుడు సమాచారం, నకిలీ వార్తలను ప్రచారం చేసినట్లు గుర్తించారు.

## కల్నల్ సోఫియా ఖురేషిపై వ్యాఖ్యలు..
# మధ్యప్రదేశ్ మంత్రికి హైకోర్టు షాక్

ఢిల్లీ: కల్నల్ సోఫియా ఖురేషీపై చేసిన వ్యాఖ్యలతో వివాదంలో చిక్కుకున్న మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాకు ఆ రాష్ట్ర హైకోర్టు షాకిచ్చింది. ఖురేషిపై ఆయన చేసిన వ్యాఖ్యల విషయంలో జోక్యం చేసుకున్న హైకోర్టు, ఆయనపై తక్షణమే పోలీసు కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ)కి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కల్నల్ సోఫియా ఖురేషిని ఉద్దేశించి విజయ్ షా చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో, విషయం న్యాయస్థానం దృష్టికి చేరింది. దీనిపై విచారణ చేపట్టిన మధ్యప్రదేశ్ హైకోర్టు, మంత్రి హోదాలో ఉన్న విజయ్ షా వ్యాఖ్యల విషయంలో తీవ్రంగా స్పందించింది. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు చెందిన అత్యున్నత అధికారి డీజీపీని ఆదేశించింది. పాక్ మతోన్మాదులు పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడితే, వారి సోదరినే (సోఫియా ఖురేషి మతాన్ని ఉద్దేశించి) తాము పాకిస్థాన్ పంపి ఆపరేషన్ సిందూర్ చేపట్టామని మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ నేత కున్వర్ విజయ్ షా వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది.

# మన భార్గవాస్త్రం సిద్ధం.. శత్రు డ్రోన్ల దండుకు గండం..!

ఢిల్లీ: సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో తేలికగా అందుబాటులో ఉంటున్న డ్రోన్లు.. దేశ భద్రతకు సవాళ్లుగా మారుతున్నాయి. మొన్నటికి మొన్న భారత్‌తో ఉద్రిక్తతల సమయంలో పాక్ మన దేశంపైకి భారీ ఎత్తున డ్రోన్లతో దాడులు చేయగా.. మన దళాలు సమర్థంగా వాటిని అడ్డుకున్నాయి. భవిష్యత్తులోనూ ఇలాంటి ముప్పులు ఎదురైతే డ్రోన్ల సమూహాన్ని నిర్వీర్యం చేసేలా ఓ సరికొత్త వ్యవస్థ సిద్ధమైంది. స్వదేశీ పరిజ్ఞానంతో తక్కువ ఖర్చులోనే కౌంటర్ డ్రోన్ వ్యవస్థ ను 'భార్గవాస్త్ర 'ను అభివృద్ధి చేసింది సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థ. తాజాగా ఈ అస్త్రాన్ని విజయవంతంగా పరీక్షించారు. ఒడిశాలోని గోపాల్‌పుర్‌లో గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో 'భార్గవాస్త్ర' మైక్రో రాకెట్ వ్యవస్థను పరీక్షించగా.. అన్ని లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దీనికి మొత్తం మూడు ట్రయల్స్ నిర్వహించారు. రెండు ట్రయల్స్‌లో ఒక్కో రాకెట్ చొప్పున పెట్టి పరీక్షించారు. మూడో దశలో రెండు రాకెట్లను ఒకేసారి 2 సెకన్ల వ్యవధిలో పేల్చి లక్ష్యాన్ని ఛేదించారు. ఈ 'భార్గవాస్త్ర'ను పూర్తి స్వదేశీ సామర్థ్యంతో అభివృద్ధి చేశారు. 2.5 కిలోమీటర్ల దూరం నుంచి వస్తున్న శత్రు డ్రోన్లను గుర్తించి ఇది మైక్రో రాకెట్ల సాయంతో నిర్వీర్యం చేయగలదు. ఇందులోని రాడార్ వ్యవస్థ.. గగనతలంలో 6 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముప్పులను కూడా పసిగట్టగలదు. తొలి లేయర్‌లో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లను పెట్టి.. 20 మీటర్ల పరిధిలో ఉన్న డ్రోన్ల దండును నాశనం చేసేలా దీన్ని రూపొందించారు. ఇక, రెండో లేయర్‌లో గైడెడ్ మైక్రో మిసైల్‌ను ఉంచుతారు. ఇవి లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించి నిర్వీర్యం చేస్తాయి. సముద్రానికి 5000 మీటర్ల ఎత్తులో ఉండే భూభాగాల్లో, కొండల ప్రాంతాల్లోనూ వీటిని సమర్థంగా ఉపయోగించుకోవచ్చని కంపెనీ చెబుతోంది.

## బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని
# అప్పుల ఊబిలోకి నెట్టేసింది

హైదరాబాద్: రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో ఆదాయం లేని పరిస్థితుల్లోనూ, అప్పులపై వడ్డీలు కట్టడం వంటి ఆర్థిక బాధ్యతలు వహిస్తూ సంక్షేమ పథకాలను నిలకడగా అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర నియోజకవర్గం ఎర్రుపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నుంచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ఆరోపించారు. రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఖాళీగా వదిలిందని విమర్శించారు. అయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. 90 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రూ.9,000 కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. జూన్ 2న లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన సిబిల్ స్కోర్పై సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. ఇంద్రమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు ఖర్చు చేస్తామని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇళ్లు లేని వారు ఆందోళన చెందవలసిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ.12,500 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ప్రజలపై పన్నుల భారం మోపకుండా సంక్షేమం అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. త్వరలోనే ఇందిర సౌర గిరిజన వికాసం కింద ఆదివాసీ రైతులకు బోర్లు, సోలార్ పవర్ పంప్‌సెట్లు, డ్రిప్ వ్యవస్థలను అందజేస్తామని చెప్పారు. ఈ నెల 18న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సీఎం రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు.

## ఈ నెల 25న ప్రధాని మోదీ కీలక సమావేశం
# .. ఢిల్లీకి చంద్రబాబు, పవన్

అమరావతి: ఆపరేషన్ సిందూర్‌తో దాయాదికి చుక్కలు చూపించిన తర్వాత ఎన్డీఏ కీలక భేటీ కానుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ నెల 25న సమావేశం జరగనుంది. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు సైతం ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి గల ముఖ్య ఉద్దేశాన్ని ఎన్డీఏ నేతలకు వివరించనున్నట్లు సమాచారం. ఆపరేషన్‌లో ఉగ్రవాద శిబిరాలపై చేసిన దాడుల గురించి వివరించే అవకాశం ఉంది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు దేశ వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ప్రశంసలు లభించాయి. ప్రతిపక్ష నేతలు సైతం ప్రధాని తీసుకున్న నిర్ణయాన్ని ప్రశంసించారు. అయితే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడంతో ఎన్డీఏ ప్రభుత్వంపై విపక్షాల నుంచి విమర్శలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్, అనంతర పరిణామాలపై ఎన్డీఏ నేతలకు అవగాహన కల్పించడం ద్వారా విమర్శలను తిప్పికొట్టేలా చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎన్డీఏ కీలక భేటీ జరగనుంది. ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని మరోసారి స్పష్టం చేయనున్నారు. ఈ కీలక భేటీకి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరుకానున్నట్లు సమాచారం.

# ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం

మొదటి పేజి తరువాయి

గత 20 రోజుల్లో సీసీఎస్ భేటీ కావడం ఇది ఐదోసారి. అయితే భారత్-పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపిన తర్వాత సీసీఎస్‌తో ప్రధాని మోదీ భేటీ కావడం తొలిసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీని కేబినెట్ ప్రశంసించింది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పారని మోదీని అభినందించింది. సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకున్నారని కేబినెట్ కొనియాడింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్తాన్ ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్న సంగతి విదితమే. ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా పాకిస్తాన్ పై దాడికి దిగింది భారత్. పాకిస్తాన్ కు గట్టిగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో ఆపరేషన్ సిందూర్ ను ఆరంభించి దాయాది దేశంలోని పలు ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అదే సమయంలో పాకిస్తాన్ లో ని పలు ఎయిర్ బేస్ లను సైతం భారత్ నేలమట్టం చేసింది. పాకిస్తాన్ పదే పదే కవ్వింపు చర్యలకు పాల్పడిన తరుణంలో భారత్ ఆపరేషన్ సిందూర్ తో తన సత్తా ఏమిటో చూపెట్టింది.

# రూ.19 వేల కోట్లతో మెట్రో రెండోదశ మలిభాగం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు రెండోదశ మలిభాగం(2 బి) దాదాపు రూ.19వేల కోట్ల అంచనాలతో రూపుదిద్దుకుంది. మూడు మార్గాల్లో 86.5 కి.మీ. ప్రతిపాదించారు. జేబీఎస్-మేడ్చల్‌బీ జేబీఎస్-శామీర్‌పేటబీ శంషాబాద్ విమానాశ్రయం-ఫ్యూచర్‌సిటీ మార్గాలను ఇందులో చేర్చారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) బోర్డు ఇటీవల ఆమోదం తెలపడంతో నివేదిక తాజాగా ప్రభుత్వానికి చేరింది. వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపిన అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. జేబీఎస్ నుంచి కారానా, అల్వాల్, హకీంపేట, తూంకుంట, శామీర్‌పేట వరకు 22 కి.మీ. మెట్రో ప్రతిపాదించారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ రన్‌వే.. రహదారి పక్కనే ఉండటం, ఎలివేటెడ్‌కు రక్షణ సంస్థ అభ్యంతరం తెలపడంతో ఇక్కడ సుమారు కిలోమీటరున్నర వరకు భూగర్భంలోంచి మెట్రోని ప్రతిపాదించారు. రన్‌వే కింద నుంచి మెట్రో వెళ్లేలా డిజైన్ చేశారు. జేబీఎస్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్‌కు



24.5 కి.మీ. మేర మెట్రోని ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆంక్షలతో ఈ మార్గంతోపాటు శామీర్‌పేట ట్రాక్‌లు కూడా జేబీఎస్ నుంచి ప్రస్తుతమున్న కారిడార్ కన్నా తక్కువ ఎత్తులో వెళతాయి. మూడు మార్గాల కూడలిగా జేబీఎస్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాలన్న సీఎం ప్రణాళికకు అనుగుణంగా ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్‌సిటీ వరకు 40 కి.మీ. మార్గం ప్రతిపాదించారు. విమానాశ్రయంలో టర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో రావిర్యాల ఓఆర్‌ఆర్ వరకు ఎలివేటెడ్‌లో మెట్రో వెళితే.. అక్కడి నుంచి ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలోంచి భూ మార్గంలో 18 కి.మీ. వెళ్లేలా డీపీఆర్ సిద్ధం చేశారు.

కేంద్ర, రాష్ట్ర సంయుక్త ప్రాజెక్టుగా..

రెండోదశ రెండో భాగాన్ని సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టుగా చేపట్టేలా డీపీఆర్ రూపకల్పన చేశారు. అంచనా వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. 48 శాతం బ్యాంకుల నుంచి రుణాలు, మిగిలిన 4 శాతం పీపీపీలో సమకూర్చుకునేలా డీపీఆర్ రూపొందించారు.

# రూ. 22వేల కోట్లతోరెన్యూ ఎనర్జీ కాంప్లెక్స్

మొదటి పేజి తరువాయి



భారతదేశంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన పెట్టుబడులలో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు తొలిదశలో రెన్యూ సంస్థ 587 మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్, 415 మెగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై రూ.7 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. వివిధ దశల్లో 1800 మెగావాట్ల సోలార్, 1 గిగావాట్ విండ్, 2000 మెగావాట్ల సామర్థ్యం గల బ్యాటరీ స్టోరేజి యూనిట్లపై మొత్తంగా రూ. 22 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద రెన్యూవబుల్ పవర్ కాంప్లెక్స్ గా ఆవిర్భవించడమే గాక ఏపీ క్లీన్ ఎనర్జీ కెపాసిటీ, గ్రిడ్ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. 2019కి ముందు 777 మెగావాట్ల సామర్థ్యంతో ఏపీ పునరుత్పాదక ఇంధనరంగంలో ప్రధాన పెట్టుబడిదారుగా ఉన్న రెన్యూ... ఆ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అరాచక విధానాలతో పెట్టుబడులు పెట్టడం ఆపేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పునరుత్పాదక ఇంధన రంగం మళ్లీ పట్టాలెక్కింది. గతేడాది అక్టోబర్ లో క్లీన్ ఎనర్జీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, రెన్యూవబుల్ ఎనర్జీ పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను దావోస్ చర్చల్లో మంత్రి లోకేశ్ రెన్యూ పవర్ ఛైర్మన్‌కు వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఫాస్ట్-ట్రాక్ అనుమతులు, ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు పునరుత్పాదక ఇంధనరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయడమేగాక పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపాయి. దీంతో పునరుత్పాదక ఇంధనరంగంలో పెట్టుబడుల ప్రవాహం మొదలైంది. వచ్చే ఐదేళ్లలో 72 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు రాష్ట్రానికి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి లోకేశ్ ఇప్పటికే పలు కంపెనీలతో చర్చలు జరిపి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 65వేల కోట్లతో 500 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకు రాగా, కనిగిరిలో తొలిప్లాంట్ కు మంత్రి లోకేశ్ ఇటీవల భూమిపూజ చేశారు. టాటా పవర్ (7వేల మెగావాట్లు, రూ.49వేల కోట్ల పెట్టుబడి), ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు (రూ.1.86 లక్షల కోట్లు), వేదాంత అనుబంధ సంస్థ సెరెంటికా (10వేల మెగావాట్లు, రూ. 50వేల కోట్లు), ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ (1200 మెగావాట్లు, 6వేలకోట్ల పెట్టుబడులు), బ్రూక్ ఫీల్డ్ (8వేల మెగావాట్లు, రూ.50వేలకోట్ల పెట్టుబడి) తదితర ప్రఖ్యాత సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలవనుంది.

# రాష్ట్రపతితో సీడీఎస్, త్రివిధ దళాధిపతుల సమావేశం

మొదటి పేజి తరువాయి

"రక్షణ దళాల అధిపతి జనరల్ అనిల్ చౌహాన్, సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాల అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నావికా దళాల అధిపతి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉగ్రవాదంపై భారతదేశం యొక్క ప్రతిస్పందనను అద్భుతమైన విజయంగా మార్చిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు" అని రాష్ట్రపతి భవన్ తన ట్వీట్‌లో పేర్కొంది.

# భారత ఓడరేవులో 21 మంది పాకిస్థానీలు..

ఢిల్లీ: భారత్-పాకిస్థాన్ మధ్య చెలరేగిన ఉద్రిక్తతలు ఇప్పుడిప్పుడే సద్దుమణుగుతున్నప్పటికీ దేశంలోని అన్ని ఓడరేవుల వద్ద కట్టుదిట్టమైన భద్రతను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశా లోని పారదీప్ పోర్టు కు వచ్చిన ఓ ఓడ కలకలం రేపింది. ఆ ఓడలో 21 మంది పాకిస్థానీ సిబ్బంది ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో కలకలం రేగింది. దాంతో ఆ పోర్టు భద్రతను మరింత పెంచారు. ఆ ప్రాంతంలో వెంటనే హై అలర్ట్ ప్రకటించారు. బుధవారం ఉదయం దక్షిణ కొరియా నుంచి సింగపూర్ మీదుగా ఓ నౌక పారదీప్ పోర్టుకు చేరింది. 'ఎమ్‌టీ సైరెన్ II' పేరుతో ఉన్న ఈ షిప్‌లో మొత్తం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఈ షిప్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ కోసం ముడి చమురును తీసుకొచ్చింది. ఈ సందర్భంగా తనిఖీలు చేపట్టగా ఆ నౌకలోని సిబ్బందిలో 21 మందిని పాకిస్థానీలుగా గుర్తించారు. ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ నుంచి దీని గురించి సమాచారం అందడంతో వెంటనే ఒడిశా మెరైన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. పోర్టులో భద్రతను మరింత పెంచినట్లు మెరైన్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బబితా దుహేరి తెలిపారు. ఓడరేవు ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రస్తుతం ఈ నౌక పోర్టుకు 20 కిలోమీటర్ల దూరంలోని 'పీఎం బెర్త్' వద్ద లంగర్ వేసి ఉంది. ఇందులో 11,350 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముడి చమురు అన్‌లోడింగ్ పూర్తయ్యేవరకు 25 మంది సిబ్బంది నౌక నుంచి బయటికి రాకుండా భద్రతాఏర్పాట్లు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# శాంతిచర్చలకు మేం రెడీ.. మోడీ సర్కార్ సిద్ధమా?..
## మావోయిస్టుల సంచలన లేఖ

ఢిల్లీ: చర్చల ద్వారా శాంతి నెలకొల్పాలని కోరుతూ మావోయిస్టు పార్టీ మరో లేఖ విడుదల చేసింది. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదల చేశారు. శాంతియుత సంభాషణల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడానికి మా పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మోడీ ప్రభుత్వం దీనికి అనుకూలంగా ఉందో లేదో స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి, ఆపరేషన్ కగార్‌ను ఆపడానికి ముందుకు రండి. శాంతి చర్చలు జరపడానికి ప్రభుత్వాన్ని ఒప్పించడానికి ముందుకు రండి.. అంటూ పౌర హక్కుల ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు. కాగా మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇటీవలే ఆపరేషన్ కగార్ పేరుతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు అడవిని మొత్తం జల్లెడ పట్టాయి. ఈ ఆపరేషన్‌లో అనేక మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగించాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగించారు. ఈ నేపథ్యంలో తాము శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టులు లేఖ విడుదల చేశారు.

# భవిష్యత్తులో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

విజయవాడ: ప్రపంచంలో 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. ప్రధాని మోదీ హయాంలో ఐదో స్థానానికి చేరిందని భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. భవిష్యత్తులో జపాన్‌ను అధిగమించి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనుందని అభిప్రాయపడ్డారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర పదాధికారులు, నీటిసంఘాల అధ్యక్షుల సదస్సులో ఆమె మాట్లాడారు. దేశంలో ఇప్పటికీ నూటికి 58 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. 70 శాతం మంది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉన్నారని పేర్కొన్నారు. పర్యావరణ మార్పులు రైతులపై ప్రభావం చూపుతున్నాయని.. వర్షపాతం చూసుకుని అధిక దిగుబడినిచ్చే విత్తనాలు ఎంచుకోవడం ఉత్తమమని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. "కనీస మద్దతు ధరపై చట్టబద్ధత కష్టం. ఒకే పంటను వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు పరిస్థితుల మధ్య పండించడమే దీనికి కారణం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విత్తనాలకు సంబంధించి కేంద్రప్రభుత్వం జీన్ బ్యాంకును ప్రారంభించింది. 100 వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేకదృష్టి సారించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాం. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను 2006లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు అమలు చేయలేదు?" అని పురందేశ్వరి ప్రశ్నించారు.

# సీఐపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

బాధితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా కోహెడలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. భూమిలో మారణాయుధాలు చూసి ఆగ్రహానికి లోనయ్యారు. ఈ సందర్భంగా..బాధితులపై దాడి జరిగినా కేసు ఎందుకు నమోదు చేయలేదని హయత్ నగర్ సీఐపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. వారికి న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి

హైదరాబాద్ హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తోంది. ప్రతి సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా హైడ్రా ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన వస్తోంది. బాధితుల నుంచి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫిర్యాదులను స్వయంగా స్వీకరిస్తున్నారు. అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే,ప్రజా వాణిలో కోహెడలో తమ భూమి కబ్జాకు గురైందని, ఫిర్యాదు చేసినా హయత్ నగర్ సీఐ పట్టించుకోవడం లేదంటూ ఏవీ రంగనాథ్ ఎదుట ఏకరవు పెట్టుకున్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఏవీ రంగనాథ్ స్వయంగా వివాదాస్పద స్థలాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు.

# నేను నిత్య విద్యార్థిని, కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉంటా

మొదటి పేజి తరువాయి



గతంలో ఏ పని చేయాలన్న ప్రభుత్వం అనుమతి అవసరమన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలు రాగానే మార్పులు వచ్చాయని తెలిపారు. అప్పుడప్పుడే వస్తున్న ఐటీని సద్వినియోగం తీసుకున్నామని తెలిపారు. అప్పుడే వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనులైన సులువుగా చేసుకుని పరిస్థితి వచ్చిందని తెలిపారు. పేదరికం లేని సమాజమే లక్ష్యం పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి అనేది తన ధ్యేయమన్నారు. ఇష్టపడి పని చేస్తే కష్టం ఉండదని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ లో ఇప్పటికే 330 సర్వీసులు ఇస్తున్నామని, మరి కొద్ది రోజుల్లో 400కు పెంచుతామని వెల్లడించారు రెండు మూడు నెలల్లో వాట్సప్ గవర్నన్స్?పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఎదగాలని పిలుపునిచ్చారు. అందుకే రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో మైక్రో ఇరిగేషన్ కు ఆంధ్రప్రదేశ్ చిరునామా కావాలని ఆకాంక్షించారు. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు.

"ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏ పనైనా సులువుగా చేసుకునే పరిస్థితి వచ్చింది. గతంలో ఎక్కడ చూసినా రహదారులు గుంతలతో కనిపించేవి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రోడ్లను చక్కగా నిర్మించారు. ఇప్పుడు ఎక్కడ చూసినా జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోంది. సంపద సృష్టించాలి.. ప్రజలకు అందించాలి. పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తున్నాం. నేను ఎప్పుడూ విద్యార్థిగానే ఉంటా.. అనునిత్యం కొత్త విషయాలు తెలుసుకుంటా. సాంకేతికత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంది. సాంకేతిక యుగంలో సమర్థత పెంచుకోవాలి. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉన్నారు.. అందులో తెలుగువాళ్లే అధికం. నా ఆలోచన ఒకటే. మనం బాగుంటేనే చాలదు.. తిరిగి సమాజానికి ఇవ్వాలి" అని చంద్రబాబు అన్నారు.

## పండుగ వాతావరణంలో తెదేపా మహానాడు..
# ఏర్పాట్లపై మంత్రి లోకేశ్ సమీక్ష

మంగళగిరి: తెలుగుదేశం పార్టీ మహానాడుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మహానాడును మే 27 నుంచి 29 వరకు కడపలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు మంత్రి, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. మహానాడు ఏర్పాట్లపై పొలిట్ బ్యూరో సమావేశానికి ముందు ఆయన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో మహానాడు కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లతో సమావేశమయ్యారు. మహానాడు ఏర్పాట్ల గురించి నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. పొలిట్ బ్యూరో సమావేశంలో మహానాడు ఏర్పాట్లపై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "ఏటా మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నాం. పార్టీ కష్టకాలంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడును నిర్వహించాం. గత ప్రభుత్వంలో మహానాడుకు అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అయినా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేశారు. పార్టీ ఆవిర్భావం తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా తిరుగులేని మెజార్టీ సాధించాం. మహానాడుకు వచ్చే కార్యకర్తలకు వసతి, రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి" అని నేతలకు దిశానిర్దేశం చేశారు.

మే 29న బహిరంగ సభ

మూడు రోజుల పాటు జరిగే ఈ మహానాడులో.. మొదటి రోజు తెదేపా విధి విధానాలు, సిద్ధాంతాలు, కార్యాచరణపై చర్చించనున్నారు. రెండో రోజు రాష్ట్రం కోసం కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన తీర్మానాలు చేయనున్నారు. మూడో రోజు బహిరంగ సభ నిర్వహించనున్నారు. పార్లమెంట్ మహానాడు, నియోజకవర్గ మహానాడు నిర్వహణపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, సవిత, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామితో పాటు సీనియర్ నేతలు బీద రవిచంద్ర యాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దామచర్ల సత్య, రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, వీరంకి వెంకట గురుమూర్తి, మంతెన రామరాజు, సి.భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, ఆర్.మాధవి రెడ్డి, జీవీ ఆంజనేయులు, మంతెన సత్యనారాయణ రాజు, చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర సమాచార కమిషనర్లు




హైదరాబాద్ : రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లుగా సీనియర్ జర్నలిస్టులు పీవీ శ్రీనివాస్, అయోధ్య రెడ్డి, న్యాయవాదులు దేశాల భూపాల్, మోహిసినా పర్వీన్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో వారితో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, సీఎస్ కె. రామకృష్ణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆర్టీఐ కమిషనర్లకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. వీరు పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు లేదా వయసు 65 ఏళ్లు నిండే వరకు వారు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లుగా కొనసాగుతారు.

జనం
రిపోర్టర్ తెలుగు దినపత్రిక



# లైసెన్సుడ్ సర్వేయర్ల శిక్షణకు అర్హులైన అభ్యర్థులు మే 17 లోపు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు..!!




వికారాబాద్ జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వికారాబాద్ జిల్లా లోనిభూమికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి (భూ హక్కుల రికార్డు) చట్టం-2025 ను ఏప్రిల్ 14న డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ జయంతి నాడు ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇంటర్ లో గణితం (60 శాతం మార్కులు) నుంచి బీటెక్ సివిల్ వరకు అర్హత కలిగిన అభ్యర్థులు మే 17 వరకు మీ- సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.రెవెన్యూ పరిపాలనకు, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ విభాగం సహాయంగా, రాష్ట్రంలోని దాదాపు 5000 మంది లైసెన్స్ పొందిన సర్వేయర్లకు శిక్షణ ఇవ్వాలని యోచిస్తోందని, లైసెన్సుడు సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్



మేనేజ్మెంట్ (తాలిమ్) దరఖాస్తులను ఆహ్వానించిందని, రాష్ట్రంలోని అన్ని మీసేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు, ప్రాస్పెక్టస్ పొందవచ్చని, మీసేవా కేంద్రాల్లోనే ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇంటర్ లో గణితంతో 60 శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్ మెన్ (సివిల్) డిప్లొమా (సివిల్), బీటెక్ (సివిల్) లేదా సమానమైన అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మే 26 నుండి జులై 26 వరకు 50 రోజుల పని దినాల్లో శిక్షణ ఇవ్వబడుతుందని, ఇందుకు ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, బీసీ అభ్యర్థులు రూ.5 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్య ర్థులు రూ.2,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉత్తర నియోజకవర్గం మాధవధార
## మురళి నగర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయుల



( జనం రిపోర్టర్ ): ఆధ్వర్యంలో ఈరోజు 50 వార్డులో శ్రీ మాధవ్ మురళి హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులలో ఈ సంవత్సరం గాను 580మార్కులు పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులను గుర్తించి సుమారు



ఎనిమిది మంది విద్యార్థులకు బిజెపి బిసి నాయకులు మూల వెంకటరావు,బిజెపి జిల్లా ఓబీసీ జనరల్ సెక్రెటరీ సనపల రామకృష్ణ గారు, బిజెపి ఓబీసీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆర్ విజయ చంద్రుడుప్రైజ్ మనీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర యువ నాయకులు ఎస్ దిలీప్ గారు, బిజెపి జిల్లా సెక్రెటరీ టి పద్మ గారు,బిజెపి 50 వార్డు అధ్యక్షులు కూన వెంకటరావు, సత్య గారు పలువురు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వేపగుంట పేస్ట్రీ చేప్ రెస్టారెంట్ లో కల్తీ ఆహారం కలకలం..



( జనం రిపోర్టర్ ) : ఆదివారం నాడు ఓ యువతి పేస్ట్రీ చేప్ నందు ఓ ఫుడ్ ఆర్డర్ చేశారు. అది తిన్న మరుక్షణమే ఆమె అస్వస్థతకు గురైంది. హుటా హుటిన ఆసుపత్రిలో చికిత్స... ఫుడ్ పాయిజన్ తో యువతి పరిస్థితి విషమం....పెందుర్తి పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేసిన ఫుడ్ పాయిజన్ బాధిత తల్లీ.. ఈరోజు పేస్ట్రీ చేప్ రెస్టారెంట్ లో విజిలెన్స్ అధికారులు ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు...

## గుంటూరు నగర పాలక సంస్థ, అంతర్గత డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి



గుంటూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల వారీగా అంతర్గత డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, డ్రైన్లలో చెత్త వేసే వారికి అపరాధ రుసుం విధించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ప్రజారోగ్య అధికారులు, ఎన్విరాన్మెంట్ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం కమిషనర్ పాత గుంటూరు, కొత్తపేట, సీతానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై సంబందిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగ కార్మికులు తమకు కేటాయించిన ఇళ్ల నుండి నూరు శాతం చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రజలు రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలు వేయడం తగ్గుతుందన్నారు. కార్మికులు, కార్యదర్శులు ప్రతి రోజు చెత్త సేకరణకు వెళ్లే సమయంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. నోడల్ అధికారులు కూడా ప్రతి రోజు తమకు కేటాయించిన ప్రాంతాల్లో కార్మికుల హాజరు, క్షేత్ర స్థాయిలో పనితీరు, ప్రజల అభిప్రాయాలను పరిశీలించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులపై నివేదిక ఇవ్వాలన్నారు. వార్డ్ ల వారీగా బ్లాక్ స్పాట్స్ లేకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా గ్రీన్ మ్యాట్ లు, చెత్త వేయకూడదని బ్యానర్లను ఇంజినీరింగ్ అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తున్నారన్నారు. ఆయా ప్రాంతాల్లో గమనించి, వారికి అపరాధ రుసుం విధించాలన్నారు. బిఆర్ స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ కి అంతరాయంగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.పర్యటనలో డిఈఈ నాగభూషణం, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉపాధి కూలీలు భారీగా పాల్గొనాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్




అమరచింత/ వనపర్తి జిల్లా ప్రతినిది ( జనం రిపోర్టర్ ) : ఈనెల ఇరవై న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారుతెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ అజయ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అజయ్ మండలఅధ్యక్షులు శంకర్ లు మాట్లాడుతూ. ఈనెల 20న దేశ వ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ లో ఉపాది కూలీలుసిబ్బంది కూడా సమ్మెలో భాగస్వాములు అయ్యి సమ్మెను విజయవంతం చేయాలనీ ఇలుపునిచ్చారు. ఉపాది పెండింగ్ బకాయిల విడుదల, పని ప్రదేశం లో మంచినీటి వసతి ఏర్పాటు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్. తట్ట బుట్ట పార లు టెంట్ల సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోజు కూలి 600ఇవ్వాలని, ఏడాదికి 200పనిదినాలు కల్పించాలని, డీమాండ్ చేశారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం ఉపాదికి కేవలం 80వెల కోట్ల బడ్జెట్ కోటాయించడం దారుణమని విమర్శించారు. కనీసం ఏడాదికి 2కోట్ల బడ్జెట్ ఇవ్వాలని డీమాండ్ చేశారు. కూలి కల్పించాలని కోరిన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డ్స్ ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. జాబ్ కార్డులో కొత్త పేర్లను నమోదు చేయాలనీ తదితరసమస్యల సాధనకై జరుగు సార్వత్రికసమ్మె గ్రామీణ బందు లో ఉపాధి కూలీలు ఈజిఎస్ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలనీ విజ్ఞప్తి చేశారు. అనంతరం సూపరిడెంట్ లక్ష్మయ్యకు డిమాండ్ నోటీసును అందజేశారు.ఈ కార్యక్రమం లో మోహన్ వెంకటన్న ముని తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ లో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చారిత్రాత్మకం

### గత ప్రభుత్వంలో వందకుపైగా నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్లు మక్తల్ కు మాత్రం శూన్యహస్తం స్థానిక ఎమ్మెల్యే రాకతో ఏడాదిన్నరకే మక్తల్ లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి ఎమ్మెల్యే శ్రీహరి మానస పుత్రికల్లో డయాలసిస్ సెంటర్ ఒకటి



అమరచింత/ మక్తల్/ వనపర్తి జిల్లా ప్రతినిధి/ ( జనం రిపోర్టర్ ) : మక్తల్ నియోజవర్గ వాసులకు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న డయాలసిస్ సెంటర్ పూర్తిస్థాయి సౌకర్యాలతో అన్ని హంగులతో అందుబాటులోకి వచ్చిందని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఇకమీదట మక్తల్ నియోజకవర్గం ప్రజలు డయాలసిస్ సేవల కోసం నారాయణపేట లేదా మహబూబ్నగర్ కు వెళ్లాల్సిన అవసరం లేదని పూర్తిగా మక్తల్ ప్రభుత్వాసుపత్రి పరిధిలోని డయాలసిస్ సెంటర్ లో సేవలను ఉచితంగా అందుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం డయాలసిస్ సెంటర్లో అయిదు పడకల సామర్థ్యంతో పేషెంట్లకు డయాలసిస్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ,గత జనవరిలో వైద్యారోగ్య శాఖామంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్ ను దాదాపు కోటి నలభై లక్షల రూపాయలతో ప్రారంభించుకున్నామని, అయితే కొన్ని సౌకర్యాలు అందుబాటులో లేక కాస్త ఆలస్యమైందని, ప్రస్తుతం అన్ని సౌకర్యాలు కల్పించి పూర్తిస్థాయిలో డయాలసిస్ సెంటర్ సేవలను ప్రారంభించుకున్నామని తెలిపారు. దీనిపై ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేశాయని, గత 10ఏళ్లుగా మక్తల్ లో డయాలసిస్ సెంటర్ ప్రారంభించాలని ఎందుకు గత పాలకులకు ఆలోచన రాలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100కు పైగా నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్ సేవలు ప్రారంభమయ్యాయని, రాష్ట్రంలో మొత్తం 119 నియోజవర్గాలుంటే 100కు పైగానే నియోజకవర్గాల్లో డయాలసిస్ సెంటర్ సేవలు అందుబాటులోకి రాగా మక్తల్ నియోజవర్గంలో మాత్రం డయాలసిస్ సెంటర్ ను గత పాలకులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. సరిహద్దు గ్రామాల్లో ఉన్న ప్రజలు గతంలో నారాయణపేట లేదా మహబూబ్నగర్ కు వెళ్లాలంటే వందకు పైగా కిలోమీటర్లు ప్రయాణించి వ్యయా ప్రయాసలకోర్చి డయాలసిస్ సేవల కోసం చాలా ఇబ్బందులు పడేవారని అన్నారు. ఇక మీదట మక్తల్ లోనే డయాలసిస్ సెంటర్ సేవలు ప్రారంభంతో.. ప్రజల ఇబ్బందులు తొలగించామన్నారు. డయాలసిస్ సెంటర్ నిర్వహణ కోసం దాదాపు నెలకు 5 నుంచి 6 లక్షల వరకు వ్యయం అవుతుందని.. ఏడాదికి కనీసం 60 లక్షల రూపాయలు డయాలసిస్ సెంటర్ నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మక్తల్ లో 150 పడకల ఆసుపత్రి పనులను ప్రారంభించుకున్నామని,అతి త్వరలో నిర్మాణం పూర్తి చేసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వైద్య ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా డయాలసిస్ సెంటర్ సిబ్బందిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమం లో మక్తల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ రవికుమార్, మాజీ జెడ్పిటిసి లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ రవి కుమార్, నేతలు చంద్రకాంత్ గౌడ్, కోళ్ళ వెంకటేష్, మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, శివరాం రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు ఫయాజ్ ,శాలంబిన్ ఉమర్, నేతలు వల్లంపల్లి లక్ష్మణ్, కావలి తాయప్ప, గాయత్రి అనిల్, కట్ట వెంకటేష్, బోయ వెంకటేష్, మందుల నరేందర్, వాకిటి హనుమంతు, నాగేష్, కావాలి రాజేందర్, నాగరాజ్, కల్లూరి గోవర్ధన్, గుంతలి రవికుమార్, వాకిటి నాగరాజు, బోయ నరసింహ, సురేష్ ,నాగేందర్ , అబ్దుల్ రెహమాన్ , మెకానిక్ రాము ,రహీం పటేల్, రాఘవరెడ్డి, శంషాద్దీన్ భూత్పూర్ చెన్నయ్య గౌడ్ , పొర్ల నరసింహ, మిస్కిన్ నాగరాజ్, మహమ్మద్ నయుం, గద్వాల రవి ,మొగులప్ప , కృష్ణమూర్తి , అక్కల రాకేష్ ,గార్లపల్లి అశోక్ గౌడ్ ,హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ వినుత , మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ , సివిల్ ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్ యాదగిరి ,డయాలసిస్ సెంటర్ ఆపరేటర్స్ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# నేడు అమరచింతకు మక్తల్ ఎమ్మెల్యే రాక



అమరచింత వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : అమరచింత మునిసిపాలిటీ కేంద్రానికి నేడు మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, అరుణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు. అమరచింత, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 18 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు టిపిసిసి చైర్మన్ కల్లుగీత డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ తో కలిసి బాధితులకు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

## గుంటూరు నగర పాలక సంస్థ, అన్న క్యాంటీన్లో ఆహారం నాణ్యత శుభ్రం పాటించాలి



గుంటూరు ( జనం రిపోర్టర్ ) :అన్నక్యాంటీన్లల్లో ఆహారం కోసం వచ్చే వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని, అందుకు తగిన విధంగా క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా అక్షయ పాత్ర సిబ్బంది చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ఆదేశించారు. కమిషనర్ బుధవారం బస్టాండ్ దగ్గరలోని అన్న క్యాంటీన్ ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పరిశీలించి, మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే క్యాంటీన్లలో అందించే ఆహారంపై ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపేలా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ లను స్కాన్ చేయడం ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయవచ్చున్నారు. క్యాంటీన్లలో ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటిని సమగ్రంగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# రెవెన్యూ గ్రామసభల ద్వారా ఆర్జీలను స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి

### చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి : దారూర్ ( జనం రిపోర్టర్ ) : ధరూర్ మండలం కేరెల్లి గ్రామం, కుకింద గ్రామం లో బుధవారంఏర్పాటు చేసిన భూ భారతి రైతు సదస్సు లల్లో పాల్గొన్నారు...ఈ సందర్బంగా రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తు లను పరిశీలించారు.రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ఉచితంగా దరఖాస్తులు సమర్పించవచ్చు.. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టం అమలులో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుండి దరూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో, భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొనాలని, దరఖాస్తులు స్వీకరించి నూతన చట్టం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు,గతంలో ప్రజలు తహసీల్దార్,ఆర్డీఓ లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులు స్వయంగా గ్రామాలకే వచ్చి ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి



తెచ్చిన భూభారతి చట్టం కింద రైతులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపిన మీదట, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ రెవెన్యూ బృందాలను ఆదేశించారు. భూ భారతి పైలెట్ ప్రాతిపాదికన వికారాబాద్ జిల్లా ధరూర్ మండలంలోని గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాల్సి ఉంటుందని అన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశమై భూభారతి దరఖాస్తుల పరిశీలన, విచారణ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. రెవెన్యూ గ్రామాలలో నిర్వహించిన సదస్సుల సందర్భంగావచ్చిన దరఖాస్తు లను పరిశీలించారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని, మొక్కుబడిగా కాకుండా ప్రతి అంశాలపై ఎంతో జాగ్రత్తగా, సమగ్రంగా పరిశీలించాలని హితవు పలికారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతిలోని నిబంధనలపై పరిపూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే, తప్పిదాలకు తావులేకుండా దరఖాస్తుల పరిశీలన, విచారణ ప్రక్రియలను నిర్వహించగల్గుతారని అన్నారు. ముందుగా డెస్క్ వర్క్ ద్వారా రెవెన్యూ రికార్డులతో దరఖాస్తులో వివరాలను సమగ్రంగా పరిశీలన చేసుకోవాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ జరపాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టినందున ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా, విచారణ ప్రక్రియను పూర్తి నిబద్ధత, నిజాయితీగా నిర్వహించాలని సూచించారు. అందులోనూ పైలట్ ప్రాతిపదికన నిర్వహించిన రెవెన్యూ సదస్సులు కావడం వల్ల అందరి దృష్టి కేంద్రీకృతం అయి ఉంటుందని, ఏ చిన్న అవకతవకలకు తావు కల్పించినా ప్రభుత్వ యంత్రాంగానికి, రెవెన్యూ వ్యవస్థకే చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి దరఖాస్తుల విచారణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ హితవు పలికారు. కావాలని తప్పిదాలకు తావు కల్పిస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థను అమలు చేస్తున్నందున, ప్రతి దరఖాస్తును ఎంతో జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంటుందని, దరఖాస్తుదారుడు తిరిగి అప్పీలుకు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరిపి వాస్తవ పరిస్థితులతో కూడిన అభిప్రాయాలను నివేదికలో పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ ప్రక్రియలు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరు సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. సాదాబైనామాలు, పీ.ఓ.టీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, సాధారణ విచారణలు మాత్రమే జరపాలని, హైకోర్టులో స్టే తొలగిన మీదట, ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుసరిస్తూ సాదాబైనామా, పీ.ఓ.టీలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకే దరఖాస్తులో ఒకటికంటే ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే, ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరపాలని అన్నారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియలు చేపట్టి, వారం రోజుల్లో పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి విచారణలో జాప్యానికి తావులేవు లేకుండా, రెవెన్యూ బృందాలు సమన్వయంతో పని చేస్తూ నిర్ణీత గడువులోపు దరఖాస్తుల పరిశీలన, విచారణలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అనంతరం ధరూర్ మండలం ఆవుసు పల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు...ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్ డి ఓ వాసు చంద్ర, తహసీల్దార్ లు దీపక్, శ్రీనివాస్, సజీదా బేగం, నెమత్ అలీ, వెంకటేశ్వరి, సంధ్య, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన డి. లక్ష్మి



పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈరోజు గుంటూరు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి డి లక్ష్మీ ని మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు చైర్మన్ గా ఉలవల బాబ్జి నియమించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు సంక్షేమ బోర్డు తన ప్రారంభం గురించి కార్మికులకు అందవలసిన సంక్షేమ ఫలాల గురించి చర్చించడం జరిగినది ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా డిప్యూటీ కార్యదర్శి రావుల అంజిబాబు ఒగ్గు కోటేశ్వరరావు కట్టేబోయిన శ్రీనివాసరావు గోగుల సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## గతం కంటే ఎన్నో రెట్లు వేగవంతంగా కొనుగోలు చేస్తున్నాం.....

### చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది...

### రైతులు అనవసర ఆందోళన చెందవద్దు...

### ధాన్యం కొనుగోలు పై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...

రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే14. గతం కంటే ఎన్నో రెట్లు వేగవంతంగా రైతుల పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని, రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ మే 13 నాటికి 2022-23 లో 11 వేల 26 మంది రైతుల నుంచి 88 వేల 930 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 11 శాతం చెల్లింపులు, 2023-24 లో 28 వేల 427 మంది రైతుల నుంచి 2 లక్షల 11 వేల 449 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 72 శాతం చెల్లింపులు చేయగా, ప్రస్తుత సంవత్సరం 29 వేల 206 మంది రైతుల నుంచి 2 లక్షల 18 వేల 392 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి 82% చెల్లింపులు పూర్తి చేశామని అన్నారు.మే 13 నాటికి గతం కంటే ఎన్నో రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా, కొనుగోలు చేసిన ధాన్యంలో రైతులకు వడ్ల డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నామని తెలిపారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరిశీలించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు పట్ల రైతులు అనవసర ఆందోళనలకు గురి చేయవద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## పారిశుధ్య కార్మికుల సంక్షేమం మన అందరి బాధ్యత.....

### ప్రతి పారిశుధ్య కార్మికునికి తప్పనిసరిగా ప్రమాద బీమా కల్పించాలి...

### ఇంటి వద్దనే తడి చెత్త పొడి చెత్త వేరు వేరు చేయాలి...-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 14. మన గ్రామ పంచాయతీలలో మల్టీ పర్పస్ వర్కర్లు గా పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం మనందరి బాధ్యతగా భావించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో యూనిసెఫ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల భద్రత రక్షణ గౌరవం అంశంపై ఎంపిడిఓ లకు , సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మన గ్రామాల పరిశుభ్రతకు, ప్రజల ఆరోగ్య భద్రతకు నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది క్షేమం, కుటుంబ భద్రత చూడాల్సిన అవసరం మనందరిపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని గ్రామాలలో పనిచేస్తున్న మల్టీ పర్పస్ వర్కర్ లైన ప్రతి పారిశుధ్య కార్మికునికి తప్పనిసరిగా ప్రమాద బీమా గ్రామ పంచాయతీ నిధుల నుంచి ప్రీమియం చెల్లించి తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి.ఎం.జే.జే.బి.వై, పి.ఎం.ఎస్.బి.వై పోస్టల్ వినియోగించుకొని బీమా తప్పనిసరిగా చేయించాలని అన్నారు. పారిశుధ్య కార్మికులకు రెగ్యులర్ గా సమీపంలోనే ఆరోగ్య కేంద్రంలో అవసరమైన హెల్త్ చెకప్ చేయించాలని, అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందించాలని అన్నారు. గ్రామాలలో ఇంటి వద్దనే తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలలో చెత్తను ఇంటి వద్దనే వేరువేరు చేయుట, తడి చెత్తతో ఎరువుల తయారీ, ఆదాయ ఎలా సమీకరించుకోవాలి వంటి అంశాలను కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. గ్రామాలలో సింగిల్ యూసెస్ ప్లాస్టిక్ నివారణకు కార్యాచరణ సిద్ధం చేయాలని, డిసెంబర్ నాటికి జిల్లాలో ఎక్కడ గ్రామాలలో సింగిల్ చేసేది ప్లాస్టిక్ ఉండటానికి వీలులేదని, రోడ్లపై ఎక్కడ ప్లాస్టిక్ చేత కనపడవద్దని కలెక్టర్ తెలిపారు. నంతరం పారిశుద్ధ కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు.ఈ సమావేశంలో యూనిసెఫ్ శిక్షకులు కిషన్ స్వామి , ఫణీంద్ర, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, స్వచ్ఛ భారత్ మిషన్ మేనేజర్ రాఘవులు, ఎంపీడీవోలు మండల పంచాయతీ అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తాం.....

### రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి డి.శ్రీధర్ బాబు...



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 14. అకాల వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాలలో తడిసిపోయిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం పూర్తి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.అకాల వర్షాల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న పంట వివరాలను సేకరించి రైతులకు చెల్లించాల్సిన నష్ట పరిహారం పై నివేదిక అందించాలని, మంత్రి వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాల కారణంగా ఏ రైతు నష్టపోకుండా ప్రభుత్వం తమ వంతు సహకారం అందిస్తుందని రైతులు ఎటువంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అపర సంజీవనికి ఆశ్రయం కరవు....

రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 14. అంతర్గాం మండలానికి కొత్తగా కేటాయించిన 108 అంబులెన్స్ వాహనానికి నీడ కరవైంది, ప్రత్యేక షెడ్డు గాని గదులు లేకపోవడంతో చెట్టు నీడలో నిలిపి, సిబ్బంది సేద తీసుకుంటున్నారు.షెడ్డు లేకపోవడం వల్ల వాహనం చెడిపోతుంది. ప్రజలకు కావాల్సిన వాహనం చెడిపోతే ఎలా ఇప్పటికైనా షెడ్ ఏర్పాటు చేసి వాహనం మరమ్మతులకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

## సింగరేణిలో మే 20న తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలి.... -జేఏసీ పిలుపు...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 14. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన ఒకరోజు టోకెన్ సమ్మెలో భాగంగా సింగరేణిలో కూడా కార్మికులందరూ సమ్మెలో పాల్గొనాలని, ఆర్జీ టు ఓసిపి- త్రీ కృషి భవన్ లో ఏఐటి యుసి సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్, ఐఎన్టియుసి ఆర్ జి టు వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, సిఐటియు అధ్యక్షులు తుమ్మల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి పాల్గొన్నారు.ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ... 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాయడానికి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న చర్యలను యావత్ కార్మిక లోకం తిప్పి కొట్టాలని, అందుకు మే 20వ. తేదీన తలపెట్టిన ఒక్కరోజు టోకెన్ సమ్మెలో ప్రతి కార్మికుడు కూడా భాగమై, సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఆ నాలుగు కోడ్ ల వల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని తమ హక్కులను కోల్పోతే ఏ కార్మికుడు గాని, సంఘం గాని యజమాన్యాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా కార్మికులు వెట్టి చాకిరి చేయాల్సి వస్తుందని, సంస్థ మనుగడ దెబ్బ తింటుందని చివరికి సంస్థ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని కాబట్టి సంస్థను, కార్మిక హక్కులను కాపాడుకోవడానికి సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని కార్మికుల ఐక్యతను చాటి సమ్మెను విజయవంతం చేయాలని కార్మికుల్లోకానికి పిలుపునిచ్చారు. ఒక కార్మిక సంఘం దేశ పరిస్థితులు బాగోలేనందువలన సమ్మెను విరమించుకోవాలని అనడం నిజంగా హాస్యాస్పదమని దేశాన్ని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో దేశ అభివృద్ధి కోసం పనిచేసే కార్మికులను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యమని అందువల్ల కార్మిక లోకం సమ్మెలో పాల్గొని, సమయాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజారత్నం, బ్రాంచ్ సెక్రటరీ జిగుర రవీందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గంధం సాంబశివరావు, కాంట్రాక్ట్ కార్మిక రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి, ఆవుల రవికుమార్, శంకర్, సామ్సన్ , ఇమ్రాన్ పాషా,రవీందర్ ,రాజ్ కుమార్, పోశం, వెంకటేష్, మల్లేష్, విజయ్ ,చంద్రశేఖర్ , పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ఆది గురువు శ్రీ దక్షిణామూర్తి నూతన మందిరాన్ని ప్రారంభించిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ చేవెళ్ల: ( జనం రిపోర్టర్ ) : దైవచింతనతోనే ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట క్రాస్ రోడ్ లోఆది గురువు శ్రీ దక్షిణామూర్తి నూతన మందిరాన్ని ఎమ్మెల్యే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు



రేపల్లె ( జనం రిపోర్టర్ ) : అసిస్టెంట్ కమీషనర్ అఫ్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ వింగ్ ,ఒంగోలు వారి ఆదేశాలు మేరకు మరియు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్ వారి కార్యాచరణ మేరకు నవోదయం 2.0 లో కార్యక్రమములో భాగంగా బాపట్ల ఈ ఎస్ పి ఎఫ్ ఏ ఈ ఎస్ బి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఒంగోలు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ సిఐ రామ రావు , ఎస్ఐ రాజేంద్ర బాపట్ల ఈ ఎస్ టి ఎఫ్ ఎస్ఐ ఏ శ్రీనివాస రావు ,రేపల్లె ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ దివాకర్ మరియు స్థానిక నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ మార్టురి శ్రీరామ్ ప్రసాద్ నిజాంపట్నం మండలంలోని దిండి పంచాయతి పరిధి గల నాటుసార ప్రభావిత ప్రాంతాలు అయిన అదవల, పరిశావారిపాలెం, జంపనివారిపాలెం, యేమినేనివారిపాలెం మరియు కేసనవారిపాలెం గ్రామాలలో బుధవారం వారి వారి సిబ్బందితో కలిసి పాత ముద్దాయిల ఇళ్ళలో ఆకస్మికం గా తనిఖీలు నిర్వహించారు. అదే విధం గా అదవల గ్రామంలో రూట్ వాచ్ నిర్వహించి నాటుసార సంబంధిత కార్యకలాపాలు ఏమైన జరుగుతున్నాయి ఏమో పరిసిలించారు . పాత ముద్దాయిల కోసం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో %దీ% వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నాటుసార తాగడం వాళ్ళ కలిగే నష్టాల గురించి అవగాహనా కల్పించారు. అదే విధంగా ప్రభుత్వం కల్పిస్తున్న ప్రత్యమ్నాయ ఉపాధి మార్గాల గురించి వారికీ వివరించారు. నాటు సారాని తాయారు చేసే మరియు అమ్మే వ్యక్తుల పై నిరంతర నిఘా ఉంటుంది కనుక నాటు సారా తయారీ గురించి అమ్మకాల గురించి మీకు ఏమైనా కొత్త సమాచారం తెలిసిన యెడల ఈ క్రింది నెంబరు కు తెలియజేయగలరు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని అయన తెలియజేశారు. ఈ సందర్భంగా నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ గారు మాట్లాడుతూ నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ అనేది ప్రభుత్వ లక్ష్యం కనుక నవోదయం కార్యక్రమం మిధ ప్రభుత్వం చాల సీరియస్ గ ఉంది. కనుక నిజాంపట్నం మండలంలో నల్లబెల్లంను నాటు సారా తయారీదారుడికి అమ్మేవారిపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రికరించామన్నారు.గతంలో నాటు సారాని అమ్మినవారిపైన మరియు వారికీ సహకరించిన వారిపై కొన్ని బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసామ

## సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో "మెగా జాబ్ మేళా"....





రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 14. నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ అసోసియేషన్, సింగరేణి కాలరీస్ కంపెనీ ఆధ్వర్యంలో రామగుండం ఏరియా1,2 3 ఏరియా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం దాదాపుగా 100 పైగా కంపెనీలో, 3000పైచిలుకు ఉద్యోగాల కొరకు మెగా జాబ్ మేళా తేది.18-మే -2025, ఆదివారం ఉదయం 8:00గంటల నుండి గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంగణంలో నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగించుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలియజేసారు.ఈ సందర్భంగా రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిపి మడత రమేష్, డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్ రావు, ఆర్ జీ. 1 జీఎం లలిత్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి లు మెగా జాబ్ మేళా పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది.

## పారదర్శకంగా యువ వికాసం అర్హుల జాబితా ఎంపిక.....

### బ్యాంకర్లు యువ వికాసం పథకం క్రింద అర్హుల జాబితాను వెంటనే అందించాలి...

### కాల్వల రిన్నోవేషన్ పనులను గుర్తించి ప్రతిపాదనలు అందించాలి...-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 14. రాజీవ్ యువ వికాసం కోసం పథకం క్రింద అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజీవ్ యువ వికాసం, నీటి పారుదల శాఖ కాల్వల రిన్నోవేషన్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,రాజీవ్ యువ వికాసం పథకం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అర్హులైన దరఖాస్తుల వివరాలను బ్యాంకర్లు వెంటనే సంబంధిత ఎంపీడీఓ లకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. బ్యాంకర్లు అందించిన జాబితాను ఎంపిడిఓ పరిశీలించి గత ఐదు సంవత్సరాలలో కార్పొరేషన్ ద్వారా ఇతర రుణాలు, యూనిట్ల ఏమైనా పొందు ఉన్నారా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉందో పరిశీలించి తుది అర్హుల జాబితాను పారదర్శకంగా ఎంపిక చేసి, ఎమ్మెల్యేలకు త్వరితగతిన రిపోర్ట్ అందించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలోనీ వివిధ సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న కాల్వల రిన్నోవేషన్, కాల్వలలో ఉన్న పిచ్చి మొక్కలు,చెత్త తొలగింపు, అక్కడక్కడ మరమ్మత్తు పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జడ్పీ సీఈఓ నరేందర్, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంగం డెయిరీ ని సందర్శించిన కెన్యా దేశ గవర్నర్ విల్బెర్..



పొన్నూరు మే 14 .జనం రిపోర్టర్:సంగం డెయిరీ టెక్నాలజీని బుధవారం కెన్యాదేశ గవర్నర్ డా. విల్బెర్., కెన్యా హెల్త్ కమిటిచైర్మన్ డా. ఫెడ్రిక్ , నంది కౌంటీ అసెంబ్లీ ఎంపిప పౌల్ టిర్ర, హెల్త్ సర్వీసెస్ ముఖ్య అధికారిణి: డా. మేరీ సుసాన్, సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ క్రిస్టోఫర్, బయోమెడికల్ ఆఫీసర్ ఎలిజబెత్ , వెలాసిటీ ప్రాజెక్టు మేనేజ్మెంట్ డైరెక్టర్ హరి మూర్తి,, ప్రెస్ యూనిట్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తో కలసి సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సందర్శించారు.భారత దేశంలో పాడిపరిశ్రమ కు పెట్టింది పేరు, దీనిపై కెన్యా దేశంలో పాడి పరిశ్రమలను వృద్ధి చెందించాలనే ఉద్దేశ్యంతో సంగం డెయిరీ ని పరిశీలించడం జరిగింది.సంగం డెయిరీ ఛైర్మన్ నరేంద్ర కుమార్ సందర్శకులకు గుంటూరు కో-ఆప్ మిల్క్ యూనియన్ మొదట ఫిబ్రవరి 1977లో %ూరాజూ% చట్టం 1964 కింద నమోదు చేయబడిందని మరియు ఫిబ్రవరి 1997లో %ూహీూజూ% చట్టం 1995 కింద పరస్పర సహాయ సహకార సంఘంగా మార్చబడిందని , తదనంతరం, మేము జూన్ 2013లో కంపెనీల చట్టం 1956 ప్రకారం సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (సంగం డెయిరీ)గా బాడీ కార్పొరేట్‌గా మారామని చెప్పారు. సంగం డెయిరీకి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలలో 6799 గ్రామ స్థాయి సొసైటీ లు ఉన్నాయి వాటి ద్వారా షుమారు 1,50,000 మంది పాల ఉత్పత్తిదారులు డెయిరీకి పాలు సరఫరా చేస్తారు అని తెలిపారు .సంగం డెయిరీ వ్యవస్థలు, రైతులతో కలసి ఎలాపనిచేస్తుంది, కెన్యా దేశ గవర్నర్ వారి బృందం తెలిసికోవటం జరిగింది.ఎలా ఉద్భవించింది, రైతులతో ఎలా మమేకమై నడిపిస్తున్నారు తెలుసుకున్నారు.పరిశ్రమలో పాలను ఎలా సేకరించి నిలువచేసి వాటి అనుబంధ ప్రోడక్ట్స్ ఎలా తయారు చేస్తున్నారు. అనే దానిని క్షుణ్ణంగా డైరీ సందర్శనలో వివరించారు.సహకార సంఘాల సహాయంతో పాడి రైతుల వృద్ధికి ఏలాంటి చర్యలు చేపట్టారు అనేది సంగం డైరీ ఛైర్మన్ నరేంద్ర కుమార్ వివరించారు. కెన్యాదేశ బృందం కూడా చాలా ఉత్సుకతతో అన్నీ విభాగాలను సందర్శించారు .. కెన్యా దేశ ప్రభుత్వం కూడా డెయిరీ వలన రైతాంగానికి చాలా ఉపయోగకరమైన ఆదాయం వస్తోందని ఆశించి రైతాంగాన్ని వృద్ధి పథంలో నడపడానికి అనేక రకాల చర్యలు చేపట్టారు.అని గవర్నర్ విల్బెర్ చెప్పారు. దానిలో భాగంగా మేము డైరీని పరిశీలించి చూడటం జరిగింది అనిఓ అన్నారు .. కెన్యా గవర్నర్ విజిటర్స్ బుక్ లో సంగం డైరీ పరిశ్రమలో తన అనుభవాలను ప్రత్యేకంగా వ్రాసి ధన్యవాదాలు తెలిపారు... కెన్యా బృందాన్ని సంగం డెయిరి చైర్మన్ నరేంద్ర కుమార్ దుశ్శాలువా లు కప్పి మెమంటోలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో సంగం డెయిరి ఎం.డి. గోపాల కృష్ణన్ మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్ కెన్యా దౌత్య సంబంధాలు మరింత బలోపేతం!

### కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్ఈ డాక్టర్ విల్బర్ కే. ఓచ్చిలో.

### విజ్ఞాన్స్ యూనివర్సిటీను సందర్శించిన 8 మంది కెన్యా దేశ ప్రతినిధులు.



పొన్నూరు ( జనం రిపోర్టర్ ) :భారత్%-%కెన్యా దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మసీ, బయో మెడికల్, స్కిల్ డెవలప్మెంట్, డ్రోన్ టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్ఈ డాక్టర్ విల్బర్ కే. ఓచ్చిలో అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కెన్యా దేశానికి చెందిన 8 మంది ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్ఈ డాక్టర్ విల్బర్ కే. ఓచ్చిలో మాట్లాడుతూ తమ దేశంలో విద్యా అవకాశాలను మెరుగుపరచడం, సాంస్కృతిక మార్పిడిను సులభం చేయడం, కెన్యా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతేకాకుండా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో గణనీయమైన మైలురాయిని చేరుకోవచ్చన్నారు. అంతేకాకుండా కెన్యాలో వ్యవసాయం, ఆహార సాంకేతికత, స్మార్ట్ అగ్రికల్చర్, బయోమెడికల్ ఇన్స్ట్రుమెంటేషన్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డ్రోన్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్మెంట్ వంటి రంగాల్లో పురోగతికి విజ్ఞాన్ యూనివర్సిటీ సహకారం కావాలని కోరారు. విజ్ఞాన్ యూనివర్శిటీ అందించే అత్యాధునిక సాంకేతిక వనరులు, పరిశోధన ప్రమాణాలు, విద్యారంగ నైపుణ్యాలు కెన్యా యువతకు ఎంతో దోహదపడతాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రత్యేకంగా డ్రోన్ సాంకేతికత, స్మార్ట్ వ్యవసాయ పద్ధతులపై తమ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ కెన్యా ప్రభుత్వ అభ్యర్థనను యూనివర్శిటీ అధిక ప్రాధాన్యతగా పరిగణిస్తోందని, త్వరలోనే విద్య, పరిశోధన, శిక్షణల పరంగా ద్వైపాక్షిక ఒప్పందాలు జరిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య అనేది కీలకమైనదని చెప్పారు. ముఖ్యంగా నాణ్యమైన విద్య అందరికీ సులభంగా అందించడం, సుస్థిర అభివృద్ధి లక్ష్యం, సాధారణ అధ్యయనం కాకుండా అనుభవాత్మక, ప్రశ్నోత్తర విద్య, అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను విద్యార్థులకు అందించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. విద్య, పరిశోధనలతో పాటు సాంస్కృతిక మార్పిడి, అగ్రికల్చర్ టెక్నాలజీ, పరస్పర సహకార అవకాశాల అన్వేషణ వంటి అంశాల గురించి చర్చించారు. ఉమ్మడిగా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఇరువురి మధ్య భాగస్వామ్యం పటిష్టమవ్వడంతో పాటు విద్యాపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు. దీని ద్వారా విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి అపారమైన ప్రయోజనాలు చేకూరుతాయని వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కెన్యా దేశానికి చెందిన 8 మంది ప్రతినిధులు, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ




చొప్పదండి, (జనం రిపోర్టర్) :చొప్పదండి బజారు హమాలీల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్స్ ఆవిష్కరణ చేయడం జరిగింది.సీఐటీయూ మండల కార్యదర్శి గంగిపెల్లి కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ..హమాలి కార్మికులు మే 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె లో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు పొట్ట కొట్టే చట్టాలను తీసుకువచ్చింది పూర్వకాలంలో పోరాడి సాధించుకున్న కార్మికవర్గం అనేక త్యాగాలు,పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.దీన్ని నిరశిస్తూ మే 20 తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని కేంద్ర రాష్ట్ర సంఘాలు పిలుపునిచ్చాయి.4 లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుంది.కార్మికుల సమష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం చేయబడుతుంది.ఉద్యోగ భద్రత,ఉపాధి భద్రత కోల్పోతారు.కార్మిక శాఖ కూడా నిర్వీర్యం చేయబడుతుంది.అందుకని 4 లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి.కనీస వేతనం రూ 26000 రూపాయలు ఇవ్వాలని,సామాజిక భద్రత కల్పించాలని కోరారు. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి అలాగే బోనస్,ప్రావిడెంట్ ఫండ్ ఇవ్వాలి.హమాలీలకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూనియన్ పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించేలా చేయాలి.ఉచిత విద్య వైద్యం , నీరు మరియ . అందరికీ గృహ నిర్మాణ వసతి కల్పించడం తదితర అంశాలపై ఈ సమ్మె నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ శేఖర్ పెద్ది రవి కనకరాజు భూమయ్య అంజయ్య రమేష్ అశోక్ కనుకయ్య తిరుపతి పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో అందరూ బాగుండాలి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చొప్పదండి, (జనం రిపోర్టర్) :అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.మండలంలోని భూపాలపట్నం గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ పట్నాలకు చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ.....ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేష్, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు నిజనపురం చందు,పెరుమళ్ళ గంగయ్య, ముద్దం తిరుపతి, మునిగాన సుధాకర్ గౌడ్ , మునిగాల చందు గౌడ్, మాచర్ల జయంత్,బోడిగే రంజిత్ గౌడ్,మండల కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన డ్యామేజ్ అయ్యి

## ఉన్న డీసీఎంను టూవీలర్ బుల్లెట్ బండిఢీకొని యువకుడు మృతి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) : వికారాబాద్ జిల్లా పరిధిలోని వికారాబాద్ నుండి మన్నెగూడ వెళుతున్న బుల్లెట్ బండిపై వెళుతున్న యువకుడు డ్యామేజ్ అయ్యి రోడ్డు పక్కన ఉన్న డీసీఎం కు తగిలి13/05/2025 నాడు రాత్రి అంజాల 10:30 గంటలకు వికారాబాద్ నుంచి మన్నెగూడ వెళ్లేటి డీసీఎం టీఎస్ 34 8621 గల దానికి ఎదురుగా వస్తున్న బెలోనా కార్ టీఎస్ 34%ఖీ%4921 గలది టక్కరించుకోగా అట్టి వాహనాలలో డీసీఎం రోడ్డుకు అడ్డంగా డ్యామేజ్ ఐ ఉన్న దానికి టీజీ 34 1995 గల బుల్లెట్ బండి నీ నడిపించైనా వ్యక్తి ముదిరాజ్ కార్తీక్ వెనకాల నుంచి వెళ్లి ఢీకొట్టగా తలకి మరియు ఇతర భాగాలకు బలమైన రక్త గాయాలయి అక్కడికక్కడే రాత్రి 11:20 గంటలకు చనిపోయినాడు ఇట్టి విషయమై వికారాబాద్ పోలీస్ స్టేషన్లో ఎస్సై కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగినది.

# అధికారులకు సవాల్ విసిరుతున్న మట్టి మాఫియా.

## ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని అధికారులు..

## ఇప్పటికే ఇద్దరిని ఢీకొన్న మట్టి లారీలు..

## షరా "మామూలే "అంటున్న అధికారులు.




పొన్నూరు మే 14. జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ ప్రాంతంలో గత నెల రోజుల నుండి మట్టి మాఫియా ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్దపెద్ద లారీ టిప్పర్లతో అతివేగంగా దూసుకుపోతూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇష్టానుసారంగా పల్లెల నుండి పొన్నూరు పట్టణ ప్రాంతంలో యదేచ్ఛగా మట్టిని సరఫరా చేస్తున్నారు. మట్టి టిప్పర్ల ధాటికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. బికేపాలెం ,గరికపాడు, పెద్దపాలెం, తెలగాయపాలెం, గ్రామాలలోని ప్రజల తోపాటు పొన్నూరు పట్టణ ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అనుమతి లేకుండా ప్రతిపాడు నియోజకవర్గ పరిధిలోని గ్రామాలలో మట్టిని తవ్వి పొన్నూరు , పొన్నూరు మండల పరిధిలోని దోప్పలపూడి ,పచ్చలతాడిపర్రు, చింతలపూడి గ్రామాల లో అక్రమ లేఔట్లకు మట్టిని తరలిస్తున్నారు. అక్రమ మట్టి లారీల స్పీడుకు గత నెలలో కసుకర్రు గ్రామంలో యువకుడికి తృటిలో ప్రమాదం తప్పింది. తాజాగా గత రెండు రోజుల క్రితం పాత పొన్నూరు ఆంజనేయ స్వామి గుడి మలుపు వద్ద ఓ ద్విచక్ర వాహనదారుడుని మట్టిలారి ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాల పాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. తాజాగా బుధవారం జిబిసి రోడ్డు పొన్నూరు శివారులో మట్టి లారీ కారును ఢీకొన్న ఘటనలో ఇరువురికి ఘర్షణ జరిగి రూరల్ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. ఇలా రోజుకు ఒక చోట మట్టి లారీల వేగానికి ప్రజలు గాయాలపాలై ప్రాణాలు త్రుటిలో తప్పుతున్నాయి. ఇంత జరుగుతున్న సంబంధిత మైనింగ్, విజిలెన్స్, పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరించటం పై ప్రజలు తీవ్రంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. మట్టి లారీల వేగానికి కళ్లెం లేదా అంటూ అధికారులపై మండిపడుతున్నారు. కొందరు మీడియా ప్రతినిధులు సంబంధిత అధికారులను వివరణ కోరగా షరా "మాములే"గా అన్నట్లుగా వ్యవహరించటం గమనార్హం. మట్టి లారీల వేగానికి ప్రజల ప్రాణాలు పోకముందే అధికారులు సమన్వయంతో మట్టి లారీలను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# : ధాన్యం తరలించేందుకు లారీల సమస్య లేకుండా చూడండి

ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించిన అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు



ఆత్మకూర్ వనపర్తి జిల్లా ప్రతినిధి (జనం రిపోర్టర్) :కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించేందుకు లారీల సమస్యలు లేకుండా చూడాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం ఆయన మదనపూర్ గోదాము, ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి వరి కొనుగోలు కేంద్రం, ఆత్మకూరులో రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకం చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడానికి అవసరమైన లారీలు పెట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేడిన వెంటనే లారీల్లో ట్రాన్స్పోర్ట్ చేసే విధంగా లారీలు పెట్టాలని ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన వడ్లు తాలు, చెత్త లేకుండా చూసి సరైన తేమ వచ్చిన వెంటనే ధాన్యం తూకం వేయాలని, తూకం వేసిన వడ్లను వెంటనే మిల్లులకు తరలించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఆత్మకూర్ అమర్చింత మండలాల్లో ఎక్కడ కూడా రవాణా సమస్యలు లేకుండా రోజు 4 లారీలు పెట్టాలని ట్రాన్స్పాట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున రైతులు తెచ్చిన వడ్లు పాడింకాకుండ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వడ్లపై టార్పాలిన్ కవర్లు కప్పాలని, వడ్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువ మంది హమాలీలను పెట్టి త్వరగా లోడ్ చేయాలనీ సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు అనంతరం శ్రీ లక్ష్మీ ఆగ్రోటెక్ రైస్ మిల్ ని తనిఖీ చేసారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను త్వరగా అన్లోడే చేసి తిరిగి పంపించాలని మిల్లర్ యజమానిని ఆదేశించారు. తాలు పేరుతో తూకంలో అదనంగా కోతలు విధించరాదని ఆదేశించారు. ఆత్మకూరు తహసిల్దార్ చాంద్ పాషా, ఇతర అధికారులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.



# కె.సుజాత రేపల్లెకు బదిలీలి

రేపల్లె ( జనం రిపోర్టర్)చిలకలూరిపేట:టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ గా పనిచేస్తున్న కె.సుజాత కు చిలకలూరిపేట మున్సిపాలిటీ లోనే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గా ప్రమోషన్ వచ్చింది. తెలిసిందే చిలకలూరిపేట ఆర్డర్ ను క్యాన్సిల్ చేస్తూ రేపల్లెకు బదిలీ ఉత్తర్వులు.

# శాస్త్ర సాంకేతిక విజ్ఞాన గనులు గ్రంథాలయాలు



ఏలేశ్వరం,(జనం రిపోర్టర్) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ సంచాలకులు ఎ.కృష్ణ మోహన్ వారి ఆదేశముల తో, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో, ఏలేశ్వరం శాఖా గ్రంథాలయం నందు, బుధవారం 17వ రోజు వేసవి వ్జిన తరగతులకు. 8.00నుండి.9.00 గం. వరకు కథలు చదువుట, కథలు వ్రాయుట 9.15నుండి 10.గం వరకు 10.15నుండి 11.గం మామిడి రాము పేపర్ ఆర్ట్, వేసవి విడిది లో పజిల్స్ పోటీలు నిర్వహించారు . మనకు తెలియని ఎన్నో విషయాలు ఈ తరగతులలో తెలుసుకొని ఉపయోగించు కోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 33మందివిద్యార్థిని,విద్యార్థులకు గ్రంథ పాలకులు కవి కొండల సత్యనారాయణ కేక్,చాక్స్ , పంపిణీ చేశారు.మరియు ఈ కార్యక్రమంలో పాఠకులు సైతం పాల్గొన్నారు .

# ఆర్టీసీ ప్రయాణికులు గురువారం డయల్ యువర్ డి ఎం కార్యక్రమం సద్వినియోగం చేసుకోండి డిపో మేనేజర్ జీ వి సత్యనారాయణ



ఏలేశ్వరం,(జనం రిపోర్టర్) :ప్రతిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం పట్టణంలోని స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ లో, మే 15, మధ్యాహ్నం డయల్ యువర్ డిఎం అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏలేశ్వరం డిపో పరిధిలో ప్రయాణించే ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ సాధనం ఆర్టిసి బస్సు లేనని, ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని, ఆర్టీసీ డిపో నుండి ప్రయాణికులకు ఇంకా మెరుగైన సేవలు కొరకు, మే 15 మధ్యాహ్నం 11 గంటల నుండి 12:00 వరకు తమ అమూల్యమైన సలహాలు మరియు సూచనలు డిపో మేనేజర్ కి, 9959225532 నెంబర్కు కాల్ చేసి,డయల్ యువర్ డిఎం కార్యక్రమం ద్వారా తెలియపరుస్తారని ఆశిస్తున్నానని మేనేజర్ జీవి సత్యనారాయణ పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

# అక్రమ విద్యుత్ వినియోగదారులకు జరిమానాలు...




చాట్రాయి.(జనం రిపోర్టర్) :చాట్రాయి మండలంలో విద్యుత్ శాఖ ,విజిలెన్స్ అధికారులు బుధవారం విద్యుత్ వినియోగదారుల మీటర్లను తనిఖీ నిర్వహించారు. 2660 విద్యుత్ మీటర్లను తనిఖీ నిర్వహించగా మీటర్ లేకుండా అక్రమంగా విద్యుత్తు వనియోగిస్తున్న వినియోగదారులు ఏడుగురికి 98 వేల రూపాయలు జరిమానాధించారు .అదనంగా లోడు వాడుతున్న 210 మంది వినియోగదారులకు ఆరు లక్షల 92000 జరీమాన విధించటం జరిగింది. కేటగిరి మార్చి వాడుతున్న వినియోగదారులు 29 మందికి 93 వేల రూపాయలు అపరాధ జరీమాన విధించడం జరిగిందని విజిలెన్స్ అధికారి విజయ కుమారి, నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. సత్యనారాయణ, విస్సన్నపేట డి ఈ ఈ .పి. సోమేశ్వరరావు తెలిపారు .అనంతరం మాట్లాడుతూ మొదటిసారి జరీమానాలతో సరిపెట్టడం జరిగిందని రెండోసారి అక్రమ విద్యుత్ వినియోగించినట్లయితే విద్యుత్తు చట్ట ప్రకారం కేసులు పెట్టడం జరుగుతుందని అన్నారు .ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏ ఈ .సంజయ్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఫైలేరియా వ్యాధి రక్త నిర్ధారణ పరీక్షలు



శింగనమల (జనం రిపోర్టర్) : మండల కేంద్రంలో బోధకాల వ్యాధి (ఫైలేరియా) రక్త నిర్ధారణ పరీక్షలను తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తరిమెల వైద్య సిబ్బంది మరియు మలేరియా సిబ్బంది కలసి ఆరు బృందాలుగా ఏర్పడి గ్రామములోని వివిధ కాలనీలలో ముందస్తు చర్యగా భోదకాలు వ్యాధి నిర్ధారణ కొరకు ప్రజల నుండి రక్త నమూనాల సేకరించి తరిమెల పి హెచ్ సి ల్యాబ్ కు పంపించామని వైద్యాధికారి తెలిపారు. ఫైలేరియా వ్యాధికి సంబంధించిన మైక్రో ఫైలేరియా పరాన్న జీవి రాత్రిపూట మాత్రమే మనిషి శరీరంలోని ఉపరితల రక్త ప్రవాహములో సంచరిస్తూంటాయని కనుక రక్తపరీక్షల కొరకు రక్త పూతల సేకరణ రాత్రిపూట మాత్రమే సేకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్వైజర్ సిబ్బంది నూర్ భాషా, శ్రీధర్ మూర్తి, తరిమెల పి హెచ్ సి సిబ్బంది, సి హెచ్ ఓ గంగాధర్, సూపర్వైజర్ అశ్వర్థ నారాయణ, సచివాలయ ఏ యన్ ఎం లు శైలజ, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, ఆశాబి, పద్మావతి, జయమ్మ, ప్రమీలమ్మ, రామాంజనమ్మ, హేమలత, ఆరోగ్య కార్యకర్తలు నాగరాజు, గీత, భారతి, మోహనమ్మ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల ద్వారా వృద్ధాశ్రమం నిర్వహణ.... 70 లక్షల రూపాయలతో వృద్ధాశ్రమం నిర్మాణం... -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం:(జనం రిపోర్టర్) :రామగుండం:మే 14. మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా పెద్దపల్లి జిల్లాలో వృద్ధాశ్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరెట్ లో వృద్ధాశ్రమం నిర్వహణ అవగాహన ఒప్పందం కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మహిళా సంఘాలు పొదుపు తదితర విషయాలే కాకుండా సామాజిక సేవకు ముందుకు రావడం ఎంతో సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ అన్నారు. పెద్దపల్లి జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం 70 లక్షల రూపాయల ఖర్చుతో వృద్ధాశ్రమాన్ని నిర్మించామని ఆయన తెలిపారు. వృద్ధాశ్రమంలో నిరాదరణ లో ఉన్న 50 వయోవృద్ధులు మందికి ఆశ్రయం కల్పించనున్నట్లు, అయితే ఈ ఆశ్రమాన్ని నిర్వహించటానికి జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల నుండి దరఖాస్తులు కోరగా, అర్హతగల సంస్థలు ఏవీ రాకపోవడంతో జిల్లా మహిళా సమాఖ్య వారికి ఈ బాధ్యతను అప్పగించినట్లు కలెక్టర్ తెలిపారు. వృద్ధాశ్రమాన్ని నిర్వహించడమే కాకుండా సంవత్సరానికి సుమారు ఆరు లక్షలు వృద్ధుల కోసం మహిళా సంఘం ఖర్చు చేయడానికి ముందుకు రావడం వారి సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుందని కలెక్టర్ అన్నారు. అనంతరం వృద్ధాశ్రమం నిర్వహణ విషయమై జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాలరావు తో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు స్నేహ కార్యదర్శి శోభ ,కోశాధికారి స్వప్న అవగాహన ఒప్పందం పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శివారెడ్డి పెట్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశత్తు వ్యక్తి మృతి..!!





వికారాబాద్ జిల్లా ప్రతినిది(జనం రిపోర్టర్) : వికారాబాద్ జిల్లా మున్సిపల్ పరిధిలోని శివ రెడ్డి పేట్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవషేతూ లో మృతి చెందిన వ్యక్తిమరాకేష్ మంగరాజ్ తండ్రి సుశాంత్ మంగరాజ్ ఇచ్చిన ఫిర్యదు నగా తన తండ్రి సుశాంత్ మంగరాజ్, వయస్సు 47 సంవత్సరాలు, నివాసం: బిష్ణుపూర్,నాయబలి,బాలేశ్వర్,ఒడిశా గల అతను గత సంవత్సరం నుంచి వికారాబాద్ శివ రెడ్డి పేట లో శ్రీ సరోజ్ మైన్స్ మరియు మినరల్స్ శుద్ధ కంపెనీ యందు కూలి పని చేసుకుని జీవిస్తున్నాడు. అదే కంపెనీలో పని చేసే శశికాంత్ గురు ద్వారా ఫిర్యాదుదారునికి తెలిసినదేమనగా తన తండ్రి తేదీ: 12.05.2025 నాడు సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన తండ్రి ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో తోటి వారందరూ కలిసి వెతకగా ఈరోజు మధ్యాహ్నం 01:00 గంటల సమయంలో చివరి పేట్ చెరువు నీటిలో శవమై తేలియాడున్నాడని తెలిసింది. తన తండ్రి అప్పుడప్పుడు చేపలు పట్టడానికి సివరెడ్డిపేట్ చెరువుకు వెళ్లేవాడు అలాగే నిన్న చేపలు పెట్టడానికి వెళ్లి మా తండ్రి ప్రమాదవశత్తు చెరువులో పడి చనిపోయి ఉండవచ్చని ఫిర్యాదు ఇవ్వగా వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగింది.

# రైతులపై కక్ష సాధిస్తున్న మిల్లర్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకటరామ్ రెడ్డి







నర్వ/ వనపర్తి జిల్లా ప్రతినిధి/ మే 14/(జనం రిపోర్టర్) :రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్న సంబంధిత రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నారాయణపేట జిల్లా కార్యదర్శి జి వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిన్న అడ్డగోలుగా దోచుకుంటున్న రైస్ మిల్లర్లు అనే శీర్షిక వివిధ పత్రికలలో ప్రచురితమైన వార్తకు స్పందించిన అధికారులు మరికల్ మండలం ఎలిగండ్ల దగ్గర ఉన్న సాయి బాలాజీ పారాబైల్డ్ రైస్ మిల్లును జిల్లా అధికారులు సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు.రైతులకు సంబంధించిన కొనుగోలు,ధాన్యం వివరాలు తదితర వాటి వివరాలను తెలుసుకున్నారు.రైతులను తేమ,తరుగు ఇతరత్రా కారణాలతో ఇబ్బందులకు గురి చేస్తూ అధికంగా కోత విధిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.అధికారుల హెచ్చరింపుతో గురువారం నర్వ మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు ధాన్యాన్ని తీసుకుని విక్రయించేందుకు వెళ్ళగా సాయి బాలాజీ పారాబైల్డ్ మిల్ యజమాని రైతులపై దురుసుగా ప్రవర్తిస్తూ నర్వ మండలం లోని గ్రామాల రైతుల వడ్లు నా మిల్లుకు వద్దు,నేను తీసుకోను ఇతర మిల్లులకు వెళ్ళండని ఇబ్బందులకు గురి చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడినట్లు పలువురు రైతులు తెలిపారు.వడ్లను తాలు లేకుండా,మ్యాచర్ కరెక్ట్ గా ఉండి, ప్యాడి క్లీనింగ్ మిషన్ ద్వారా క్లీన్ చేసి ధాన్యాన్ని తీసుకురావాలని లేకుంటే నా మిల్లుకు రావద్దు అని దుబాయిస్తున్నారని తెలిపారు.ఈ విషయంపై సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిబంధనలో ఉన్న దీనికి భిన్నంగా అధికారులు మిల్లర్లకు ఆదేశాలిస్తూ బస్తాకు కిలోన్నర తరుగు తీసుకోవాలని అనధికారికంగా చెబుతున్నారు.దీంతో మిల్లర్లు ఇష్టం వచ్చినట్లుగా ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా ఒక్కింతకు మూడింతలు కోత విధిస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు.ఇలా చేసుకుంటూ పోతే రైతుల పక్షాన రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు.ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగము,ప్రజా ప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులు స్పందించి రైతులకు చేస్తున్న మోసాన్ని అరికట్టి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఐఎఫ్ డబ్ల్యూజే అధ్యక్షుడు దివంగత విక్రమ్ రావు సంతాప సభ రేపు



కుత్బుల్లాపూర్ (జనం రిపోర్టర్) :సీనియర్ పాత్రికేయుడు, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ అధ్యక్షుడు దివంగత కోటంరాజు విక్రమ్ రావు సంతాపసభ ఈనెల 16వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు చిక్కడపల్లి లోని త్యాగరాయగాన సభలో జరుగుతుందని ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య తెలిపారు. దాదాపు నలభై ఏళ్ళుగా ఢిల్లీలో పలు ఆంగ్ల దినపత్రికల్లో పాత్రికేయుడిగా పనిచేసి జర్నలిస్టుల సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమం చేసిన విక్రమ్ రావు ఈనెల 12న లక్నోలో అకాల మరణం చెందారని వారు తెలిపారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే), తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే విక్రమ్ రావు సంతాప సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సంతాప సభలో జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని విక్రమ్ రావుకు నివాళు లర్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# పిఒకె మనకు దక్కుతుందా?

## (విశ్లేషణ)

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి సాధించుకోవాలన్న పట్టుదలతో భారత ప్రభుత్వం ఉంటోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను (%ఝంప్త్రఎఅతీ ర్‌శీతీఎ% ) అప్పగించడం మినహా మరో విషయం లేదని, అంతకు మించి మాట్లాడేది లేదని స్పష్టం చేసింది. కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవ చూపించినా దానికి భారత్ ఒప్పుకోవడం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని కరాఖండీగా చెప్పింది. చారిత్రాత్మకంగా ఒకప్పుడు కశ్మీర్ రాచరిక రాష్ట్రంలో భాగమైన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)ను 1947లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశంలో లేదా పాకిస్థాన్‌లో చేరడం లేదా స్వతంత్రంగా ఉండటం అనే ఎంపికకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు బ్రిటిష్ వారు అవకాశం కల్పించారు. ఆ సమయంలో జమ్మూకశ్మీర్ పాలకుడు మహారాజు హరిసింగ్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలనే హోదాను ఎంచుకున్నారు. అయితే 1947లో పూంచ్‌లో హరిసింగ్ ఆ ప్రాంత రైతులపై విధించిన శిక్షాత్మక పన్నుల కారణంగా తిరుగుబాటు తలెత్తింది. అదే సంవత్సరం అక్టోబర్‌లో వాయువ్య సరిహద్దు ప్రావిన్స్‌కు చెందిన వేలాది మంది పష్టున్ గిరిజనులు మహారాజా పాలన నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి కల్పించాలన్న లక్షంతో పాకిస్తాన్ సైన్యం మద్దతుతో పోరాటం సాగించారు. పరిస్థితిని అదుపు చేయడంలో మహారాజా హరిసింగ్ సైన్యం విఫలమైంది. ఫలితంగా తిరుగుబాటుదారులు పూంచ్ జిల్లాలో ఎక్కువ భాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముజఫరాబాద్, బారాముల్లాలను స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించారు. ఇక చేసేదిలేక భారత ప్రభుత్వ సహాయాన్ని మహారాజా కోరారు. దానికి భారత ప్రభుత్వం ఒక షరతు విధించింది. భారతదేశంలో జమ్మూకశ్మీర్ విలీనం ఒప్పందానికి అంగీకరిస్తూ సంతకం చేయాలని సూచించింది. దాంతో మహారాజు హరిసింగ్ అంగీకరించారు. జమ్మూకశ్మీర్ రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ నియంత్రణను భారత ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవించింది. ఫలితంగా రెండు ప్రాంతాలపై స్థిరనియంత్రణ లభించింది. పాకిస్తాన్ మద్దతుగల తిరుగుబాటుదారుల ప్రభావంలో ఉన్న ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌గా ఇప్పుడు పిలవబడుతున్నది. పేరుకే స్వయం పరిపాలనా ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్ పరిపాలిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని అజాద్ కశ్మీర్‌గా వ్యవహరిస్తోంది. దీనికి సరిహద్దులుగా ఉత్తరాన గిల్గిట్ బల్టిస్థాన్ (గిల్గిట్ బల్టిస్థాన్ ఆజాద్ కశ్మీర్‌లో భాగం కాదు). దక్షిణాన పాకిస్తాన్ పంజాబ్, పశ్చిమాన ఖైబర్ పఖ్తూన్‌క్వాలు ఉన్నాయి. తూర్పు వైపున జమ్మూకశ్మీర్ ఉంది. ఈ రెండింటి మధ్య నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) ఉంది. ఇది భారత, పాకిస్తాన్ మధ్య వాస్తవ సరిహద్దుగా పనిచేస్తుంది. భౌగోళికంగా ఈ భూభాగం మొత్తం వైశాల్యం 13,297 కి.మీ (5134 చదరపు మైళు ). ముజఫరాబాద్ నగరం దీని రాజధాని. 2017 జాతీయ జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 40,45,366. దాదాపు జనాభా అంతా ముస్లింలే. పిఒకెలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. అధ్యక్షుడు రాజ్యాంగబద్ధమైన దేశాధినేత కాగా, ప్రధాన మంత్రి, మంత్రుల మండలి మద్దతుతో కార్యానిర్వాహకత్వం వహిస్తారు. ఏకసభ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఇద్దరినీ ఎన్నుకుంటుంది. స్వంత సుప్రీం కోర్టు, హైకోర్టు ఉన్నాయి. అయితే పాకిస్తాన్ ప్రభుత్వ కశ్మీర్ గిల్గిత్ బాల్టిస్థాన్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, పాకిస్థాన్ ప్రభుత్వానికి, పిఒకె ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. అయితే దీనికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదు. పిఒకెలోని ఉత్తరభూభాగం తరచుగా తీవ్ర భూప్రకంపనాలకు గురవుతుంది. 2005లో సంభవించిన భారీ భూకంపం వల్ల లక్షమంది మృతి చెందగా, మరో 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దీనివల్ల ఈ ప్రాంతం మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ విధ్వంసమయ్యాయి. వ్యవసాయం, పర్యాటకం, సేవలు పైనే ఈ ప్రాంతం ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఒకవంక పాకిస్తాన్, మరోవంక విదేశీ సాయాలతోనే పిఒకె మనుగడ సాగిస్తోంది. దాదాపు 87% పిఒకె కుటుంబాలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. పిఒకెలో ద్రవ్యోల్బణ ఒత్తిడి ఎక్కువగానే ఉంది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు తలెత్తుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ ఉదారవాద విధానాలు, నిరుద్యోగం, అధిక వలసలు ఇవన్నీ తీవ్ర సమస్యలుగా వెంటాడుతున్నాయి. నిరుద్యోగ రేటు 33% వరకు ఉంది. ఉపాధి కోసం యువత గల్ఫ్‌దేశాలకు వలసపోతున్నారు.గత కొన్ని రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, పిఒకెలో ఉన్న వనరులను స్థానిక ప్రజలకు కాకుండా పాక్‌లోని ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం తరలించుకుపోతుండడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోంది. ఇక్కడి జలవిద్యుత్‌ను పాకిస్థాన్‌లోని ఇతర ప్రాంతాలు, నగరాలకు సరఫరా కోసం తరలిస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. హక్కుల కోసం ప్రజలు వీధికెక్కుతున్నారు. ఈ పరిణామాలన్నీ పిఒకెపై పాకిస్థాన్ ప్రభుత్వ పట్టుకోల్పోడానికి దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ గమనించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తమ పాలన లోకి తెచ్చుకోవాలని భారత ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్నారు. అంతేకాదు చర్చల్లో ఇదే ప్రధాన అజెండాగా నిలుస్తోంది.

# కెనడా విదేశాంగ మంత్రిగా భారత బిడ్డ.. ఎవరామె ? ఏంటా స్టోరీ ?



కెనడాలో జరిగిన ఫెడరల్ ఎన్నికల్లో లిబరల్ పార్టీ మరోసారి ఘన విజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. పార్టీ అధినేత మార్క్ కార్నీ మరోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ క్రమంలోనే మంత్రివర్గ పునర్నిర్మాణంలో భాగంగా అనితా ఆనంద్‌ను విదేశాంగ మంత్రిగా నియమించారు. అయితే ఆమె భారత సంతతికి చెందిన వ్యక్తి కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. ఈ అరుదైన ఘనత రెండోసారి కూడా సాధించడం పట్ల ఆమెను అభినందిస్తున్నారు. కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ సహా పలువురు భారతీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా విషెస్ తెలియజేశారు. దీంతో అనితా ఆనంద్ గురించి మన వాళ్లంతా తెగ వెతికేస్తున్నారు.

### ఎవరు ఈ అనితా ఆనంద్..?

1967 మే 20న నోవాస్కోటియా లోని కెంట్‌విల్లేలో జన్మించారు అనితా ఆనంద్. ఆమె తమిళ, పంజాబీ మూలాల కలిగిన కుటుంబానికి చెందినవారు. తల్లి సరోజ్ దౌలత్‌రామ్ అనస్తీషియాలజిస్ట్ కాగా, తండ్రి సుందరం వివేక్ జనరల్ సర్జన్. ముగ్గురు సోదరీమణుల్లో పెద్దదైన అనితకు గీత, సోనియా అనే ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు.

### విద్యాభ్యాసం..

1985లో ఒంటారియోకి వెళ్లిన అనిత.. రాజకీయ శాస్త్రంలో డిగ్రీ సాధించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్రంలో ఆనర్స్ డిగ్రీ, ఆ తర్వాత డల్హౌసీ, టొరంటో యూనివర్సిటీల నుంచి న్యాయశాస్త్రంలో బాచిలర్స్, మాస్టర్స్ పూర్తిచేశారు. లాయర్‌గా ఎన్నో సంవత్సరాలు పనిచేశారు.

### వివాహం..

1995లో జాన్ నోల్టన్ అనే న్యాయవాదిని అనితా ఆనంద్ వివాహం చేసుకున్నారు. వారికి నలుగురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆమె కుటుంబంతో కలిసి ఓక్‌విల్లేలో నివసిస్తున్నారు.

పొలిటికల్ ఎంట్రీ..

అనితా ఆనంద్ రాజకీయంగా ఇప్పటికే విశేష అనుభవం పొందారు. 2019లో కెనడా ఫెడరల్ క్యాబినెట్‌లో పనిచేసిన మొదటి హిందూ మహిళగా సైతం గుర్తింపు పొందారు. 2019 నుంచి 2021 వరకు పబ్లిక్ సర్వీసెస్, ప్రొక్యూర్‌మెంట్ మినిస్టర్‌గా పనిచేశారు. అంతే కాకుండా ఆమె కెనడా రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. సాయుధ దళాల్లో లైంగిక వేధింపుల్ని ఆరికట్టి కొత్త సంస్కరణలు తీసుకొచ్చినందుకుగానూ పలు పురస్కారాలు అందుకున్నారు.

ఇక ఇప్పుడు విదేశాంగ శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అంతకు ముందు ఆ స్థానంలో మెలానీ జోలీ బాధ్యతలు స్వీకరించారు. అలానే అనితా అనంద్ గతంలో రక్షణ మంత్రిగానే కాకుండా పలు కీలక మంత్రిత్వ శాఖలను కూడా నిర్వహించారు.

భగవద్గీతపై ప్రమాణం..

మరోవైపు ప్రమాణ స్వీకారం సందర్భంగా అనితా ఆనంద్ భగవద్గీతపై చేయి ఉంచి ప్రమాణం చేశారు. గతంలో సైతం ఆమె ఇలానే వ్యవహరించి ప్రశంసలు అందుకున్నారు. అంతే కాకుండా ఎక్స్ వేదికగా.. కెనడా విదేశాంగ మంత్రిగా నియమించబడటం గౌరవంగా భావిస్తున్నానని రాసుకొచ్చారు. ప్రధాన మంత్రి మార్క్ కార్నీ నేతృత్వంలో కెనడియన్లకు సురక్షితమైన ప్రపంచాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని రాసుకొచ్చారు.

# ఆపరేషన్ సింధూర్ కు బ్రేక్ వెనుక షాకింగ్ రీజన్ ? చేతులెత్తేసిన ట్రంప్ ?



పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పీచమణించేందుకు భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. తొలుత ఉగ్రశిబిరాల నుంచి మొదలుపెట్టిన ఈ ఆపరేషన్ ఆ తర్వాత పాకిస్తాన్ లోని ఎయిర్ బేస్ లు, మిలిటరీ స్థావరాల వరకూ వెళ్లిపోయింది. ఈ క్రమంలోనే లాహోర్ లోని ఆయుధ రక్షణ వ్యవస్థల్ని సైతం భారత ఆర్మీ కుప్పకూల్చింది. అయితే ఇదంతా ఉధృతంగా సాగుతున్న సమయంలో హఠాత్తుగా భారత్-పాకిస్తాన్ ల తరఫున అమెరికా అధ్యక్షుడు కాల్పుల విరమణ ప్రకటన చేశారు. దీనిపై భారత్ లో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. పాకిస్తాన్ పై ఆపరేషన్ సింధూర్ జోరుగా సాగుతున్న సమయంలో అమెరికా మాట విని భారత్ కాల్పుల విరమణ ప్రకటించడం దేశంలో మెజార్టీ జనానికి నచ్చలేదు. ఓవైపు పాకిస్తాన్ గుండెలపై కొట్టామని, తమ మహిళల సింధూరాలు చెరిపేస్తే ఆపరేషన్ సింధూర్ తో ఉగ్రశిబిరాలనే చెరిపేశామని ప్రధాని మోడీ వెల్లడించారు. అయితే కాల్పుల విరమణను మాత్రం ఆయన సమర్ధించుకోలేకపోయారు. ఓవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తానే యుద్ధం ఆపానని పదే పదే చెప్పుకుంటున్నా ప్రధాని మోడీ మాత్రం ఈ విషయాన్ని అస్సలు ప్రస్తావించడం లేదు. అయితే ఆపరేషన్ సింధూర్ ను అర్ధాంతరంగా ఆపేయడం వెనుక పలు సంచలన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ఉధృతంగా సాగుతున్న తరుణంలో పాకిస్తాన్ లోని అణు స్థావరమైన కిరానా హిల్స్ కు సమీపంలోనే ఉన్న సర్గోదా ఎయిర్ బేస్ పైనా మిస్సైళ్ల దాడి చేసింది. వాస్తవానికి ఇది కిరానా హిల్స్ కు సమీపంలోనే ఉంది. కిరానా హిల్స్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముషాఫ్ ఎయిర్ కాంప్లెక్స్ వరకూ భూగర్భ సొరంగాలు ఉన్నట్లు సమాచారం. వీటికి సమీపంలోనే ఉన్న సర్గోదా ఎయిర్ బేస్ పై మిస్సైళ్లు పక్కనే ఉన్న సొరంగంలో ఉన్న అణు వార్ హెడ్లను తాకినట్లు తెలుస్తోంది. ఇలా భారత మిస్సైళ్లు సర్గోదా ఎయిర్ బేస్ ను టార్గెట్ చేసే ప్రయత్నంలో



కిరానా హిల్స్ కూ ముషాఫ్ కాంప్లెక్స్ కూ మధ్య ఉన్న భూగర్భ సొరంగాలపై పడి అందులో ఉన్న అణు వార్ హెడ్లను తాకడంతో రేడియేషన్ లీక్ అయినట్లు తెలుస్తోంది. ఇదే భారత్ తన ఆపరేషన్ సింధూర్ కు బ్రేక్ ఇచ్చేందుకు కారణమైనట్లు సమాచారం. అణు ధార్మికత కారణంగా రేడియేషన్ లీక్ అవుతూ పోతే ఆ తర్వాత ఊహించని ఉపద్రవం తప్పదు. అయితే దీన్ని సరిదిద్దాలంటే భారత్ దాడులు ఆపక తప్పదు. ఈ విషయాన్ని ట్రంప్ కు చెప్పిన భారత ప్రధాని మోడీని కాల్పుల విరమణ దిశగా ఒప్పించినట్లు తెలుస్తోంది. మరోవైపు భారత్ పాకిస్తాన్ లోని కిరానా హిల్స్ లో ఉన్న అణు ప్లాంట్ పై దాడి చేసినట్లు అంతర్జాతీయంగా ప్రచారం జరుగుతోంది. దీన్ని భారత ఎయిర్ ఫోర్స్ ఇప్పటికే ఖండించింది. తాము కిరానా హిల్స్ ను టార్గెట్ చేయలేదని తేల్చిచెప్పేసింది. అయితే దీనికి తగ్గర్లో ఉన్న సర్గోదా ఎయిర్ బేస్ పై దాడి చేసే ప్రయత్నంలో జరిగిన అణు రేడియేషన్ లీకేజీ వల్లే భారత్ కాల్పుల విరమణకు అంగీకరించాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. అంతే కానీ ట్రంప్ చెబుతున్నట్లు వాణిజ్యం బూచి చూపి భారత్ ను అమెరికా దారికి తెచ్చుకుందన్న వాదన తప్పని అర్థమవుతోంది.

# గోదావరి నది కాలుష్యం:ప్రాణాలకు ప్రమాదం- జీవనదికి పెరిగిన ముప్పు..!!



:భారతదేశంలో రెండో అతిపెద్ద నది,దక్షిణ భారతదేశంలోని ప్రధాన రాష్ట్రాలకు జీవనాడి అయిన గోదావరి నది కాలుష్యం బారిన పడుతోంది.ఈ ప్రభావం తెలంగాణలో ఎక్కువగా కనిపిస్తోంది.ఇటీవల ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ ,సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు నదిలోకి చేరి జలచరాల జీవనానికి మరియు మానవ ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగిస్తున్న కొన్ని ప్రాంతాలను గుర్తించింది.

తెలంగాణలో ఆందోళనకర స్థాయికి కాలుష్యం

తెలంగాణలోని గోదావరి తీర ప్రాంతాల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్,ఖమ్మం జిల్లాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లోని కర్మాగారాలు, ప్రభుత్వ రంగ సంస్థలు శుద్ధి చేయని వ్యర్థాలను నేరుగా నదిలోకి విడుదల చేస్తున్నాయి.ఇది బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (%దీూఱ%) స్థాయిలను పెంచుతోంది. భద్రాచలంలో ఈ కాలుష్య సమస్య స్పష్టంగా కనిపిస్తోంది.ఇక్కడ రసాయన మరియు మురుగునీటి కాలుష్యం కారణంగా నది నీరు తరచుగా నల్లగా మారి దుర్వాసన వస్తోంది.పట్టణీకరణ మరియు నదీతీరాలను ఆక్రమించడం కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి.నది పరీవాహక ప్రాంతమంతా అటవీ నిర్మూలన జరగడం కూడా దీనికి తోడైంది. దీని ప్రధాన ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. భారీగా పేరుకుపోయిన పూడిక మరియు నీటి నాణ్యత తగ్గడం జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. నదిపై ఆధారపడి జీవిస్తున్న అనేక గ్రామాల ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు పెరిగాయని చెబుతున్నారు.కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం పటిష్టంగా లేకపోవడంతో అవి యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాయి. పదేపదే హెచ్చరికలు చేసినప్పటికీ, అవి చట్టవిరుద్ధంగా వ్యర్థాలను నదిలోకి విడుదల చేయడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

మహారాష్ట్రలో సేంద్రీయ వ్యర్థాలు, భారీ లోహాల కాలుష్యం

నది ఎగువ భాగంలో ఉన్న మహారాష్ట్రలో, నాసిక్ నుండి పైఠాన్ వరకు సుమారు 300 కిలోమీటర్ల మేర ఇటీవల జరిగిన అంచనాలలో అత్యధిక స్థాయి సేంద్రీయ కాలుష్యం నమోదైంది. ఈ మార్గంలో సేకరించిన నీటి నమూనాలు ప్రమాదకర స్థాయిలో బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (%దీూఱ%) స్థాయిలను కలిగి ఉన్నాయి. ఇది నీటిలోని ఆక్సిజన్ స్థాయిలను తీవ్రంగా తగ్గించి,జలచరాలకు ముప్పు కలిగిస్తోంది.వ్యవసాయ వ్యర్థాలు కూడా కాలుష్యానికి మరో ప్రధాన కారణం.నాసిక్,నాందేడ్ సమీపంలోని పొలాల నుండి ఎరువులు,పురుగుమందులు శుద్ధి చేయకుండా నేరుగా నదిలోకి ప్రవహిస్తున్నాయి.ఔరంగాబాద్, పైఠాన్‌లోని కొన్ని ప్రాంతాలలో భారీ లోహాల కాలుష్యం వెలుగు చూసింది.ఇక్కడ ఇనుము,జింక్,నికెల్,కాపర్ వంటి లోహాల స్థాయిలు తాగునీటి ప్రమాణాలకు మించి ఉన్నాయని గుర్తించారు. నాసిక్ నుండి పైఠాన్ వరకు 300 కిలోమీటర్ల మేర స్థాయిలు 6-36 వరకు ఉన్నాయి. ముఖ్యంగా మత్స్య సంపదపై తీవ్ర ప్రభావం పడుతోంది. భారీగా పేరుకుపోయిన వ్యర్థాల వల్ల చేపల దిగుబడి తగ్గి ఆదాయం పడిపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. దుర్వాసన వస్తున్న నీటి వల్ల నది సమీపంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించే యాత్రికులు, పర్యాటకులు వెనుకంజ వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఆంధ్రప్రదేశ్ - అత్యంత కలుషితమైన ప్రాంతాల గుర్తింపు

ఆంధ్రప్రదేశ్‌లోనూ కాలుష్య సంక్షోభం తీవ్రంగా ఉంది.ముఖ్యంగా రాజమహేంద్రవరం నుండి ధవళేశ్వరం బ్యారేజ్ వరకు ఉన్న ప్రాంతం భారతదేశంలోనే అత్యంత కలుషితమైన నదీ భాగాలలో ఒకటిగా గుర్తించబడింది. ఆల్గే వృద్ధి, నీటి కలుపు మొక్కలు, శుద్ధి చేయని మురుగునీరు నది సహజ స్థితిని దారుణంగా మార్చేశాయి.నరసాపురంలో చట్టవిరుద్ధంగా మున్సిపల్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారనే ఆరోపణలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విచారణ ప్రారంభించింది. ఇది కాలుష్య స్థాయిలను మరింత పెంచుతోంది. ఇదిలా ఉండగా, పోలవరం ప్రాజెక్ట్ వంటి పెద్ద ఎత్తున చేపట్టిన నిర్మాణ ప్రాజెక్టుల వల్ల నీరు నిలిచిపోతోంది. దీనివల్ల కాలుష్య కారకాలు కొట్టుకుపోకుండా అక్కడే పేరుకుపోతున్నాయి.గతంలో నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్ వంటి ప్రయత్నాలు చేసినప్పటికీ, నదీతీర రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడం,నిబంధనలను స్థిరంగా అమలు చేయకపోవడం వల్ల కాలుష్య స్థాయిలు అధికంగానే ఉన్నాయి.

### జల్ శక్తి చొరవ

తెలంగాణ,మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్‌లలో కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి కఠినమైన నిబంధనలు, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, మెరుగైన మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు అవసరమని పర్యావరణవేత్తలు నొక్కి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో,జల్ శక్తి మంత్రిత్వ శాఖ గోదావరి నది కోసం దీర్ఘకాలిక నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడానికి %చీజుఙ=×% భాగస్వామ్యంతో మూడేళ్ల అధ్యయనాన్ని ప్రారంభించింది. నది పునరుజ్జీవనం కోసం ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించడంపై ఈ అధ్యయనం దృష్టి సారిస్తోంది. 2025-2028 వరకు కొనసాగే ఈ అధ్యయనం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది.

## కేబినెట్‌లో భారతీయ- కెనడియన్లకు కీలక శాఖలు



ఒట్టావా : కెనడా ప్రధాని మార్క్ కార్నీ తన క్యాబినెట్‌ను పునర్వ్యవస్థీకరించారు. కొత్త కేబినెట్‌లో భారతీయ -కెనడియన్లు అనితా ఆనంద్, మణీందర్ సిద్ధూలు కీలకమైన మంత్రిత్వ శాఖలను పొందారు. మంగళవారం ప్రకటించిన కొత్త కేబినెట్‌లో అనితా ఆనంద్ విదేశాంగ మంత్రిగా, సిద్ధు అంతర్జాతీయ వాణిజ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు అనితా ఆనంద్ ఆవిష్కరణలు, సైన్స్ మరియు పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. గతంలో రక్షణ మంత్రి సహా పలు పదవులను నిర్వహించారు. ప్రస్తుతం పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మెలానీ జోలీ స్థానంలో ఆమె నియమితులయ్యారు. కెనడా విదేశాంగ మంత్రిగా నియమితులవడం తనకు గౌరవంగా ఉందని, కెనడియన్లకు సురక్షితమైన, న్యాయమైన దేశాన్ని అందించేందుకు ప్రధాని కార్న్, తమ బృందంతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానని అనితా ఆనంద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యమంత్రిగా నియమితులవడం జీవితకాల పురస్కారంగా భావిస్తున్నానని ప్రమాణస్వీకారం అనంతరం సిద్ధు ఎక్స్‌లోపేర్కొన్నారు. వాణిజ్యాన్ని వైవిధ్యపరచడానికి, కొత్త ప్రపంచ మార్కెట్లను చేరుకోవడంలో కెనడియన్ వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి, ఉపాధి కల్పనలో సహాయపడటానికి తనపై వుంచిన విశ్వాసానికి కృతజ్ఞుడినని పేర్కొన్నారు. ఏప్రిల్ చివరి వారంలో జరిగిన కెనడా ఎన్నికల్లో లిబరల్ పార్టీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ బాధ్యతలు చేపట్టారు. రెండు వారాల తర్వాత ఆయన కేబినెట్ పునర్వ్యవస్థీకరణను ప్రకటించారు.

## భారత్-పాక్ కలిసి డిన్నర్ చేస్తే.. ఉద్రిక్తతలు తగ్గుతాయి: ట్రంప్



**న్యూఢిల్లీ,:** పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా.. భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చెప్పట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై దాడి భారత్ దాడి చేసింది. ఈ నేపథ్యంలో భారత-పాకిస్థాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాలు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడంతో పరిస్థితులు కాస్త అదుపులోకి వచ్చాయి. కానీ, ఎప్పుడు ఏం జరుగుతుందో అని అంతా భయపడుతున్నారు. అయితే భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తగ్గడానికి తానే కారణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. తాజాగా భారత్-పాకిస్థాన్ ల మధ్య నెలకొన్న పరిస్థితులు ప్రశాంతంగా మాట్లాడాలి అంటే.. ట్రంప్ ఓ సలహా ఇచ్చారు. భారత్-పాక్ దేశాల అగ్రనేతలు తను ఏర్పాటు చేసే డిన్నర్‌కు హాజరు కావాలని ట్రంప్ పేర్కొన్నారు. ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్, పాక్‌ల శాంతి చేకూరాలని కాల్పుల విరమణ ఒప్పందం జరిగేలా చేశామని అన్నారు. భారత్, పాక్ రెండు శక్తివంతమైన దేశాలు.. యుద్ధం ఆపితే వ్యాపారాలు చేసుకుందాం అని సలహా ఇచ్చామని తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య కూడా యుద్ధం ఆపడానికి చర్చలు జరుపుతున్నామని అన్నారు.

## రాష్ట్రపతితో ఆర్మీ ఉన్నతాధికారులు భేటీ



న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తోపాటు త్రివిధ దళాల అధిపతులు సమావేశమయ్యారు. బుధవారం రాష్ట్రపతి భవన్ లో ద్రౌపది ముర్మును కలిసి, పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆర్మీ ఉన్నతాధికారులతో ముర్ము సమావేశమైన ఫోటోలను రాష్ట్రపతి వర్గాలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. "డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్, నావికాదళ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. ఉగ్రవాదంపై భారత్ ప్రతిస్పందనను అద్భుతమైన విజయంగా మార్చిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు" అని పేర్కొన్నారు.ు

## సోఫియా ఖురేషిపై వివాదాస్పద వ్యాఖ్యలు.. మంత్రికి చీవాట్లు



ఇండోర్: పాక్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ చేసిన ఆపరేషన్ సిందూర్ గురించి కర్నల్ సోఫియా ఖురేష వివరించిన విషయం తెలిసిందే. అయితే మధ్యప్రదేశ్ బిజెపి చెందిన మంత్రి సోఫియా గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లు (ఉగ్రవాదులు) మన సోదరీమణుల సిందూరాన్ని తుడిచివేస్తే.. వాళ్ల(ఉగ్రవాదుల) మతానికి చెందిన సోదరిని సైనిక విమానంలో పంపి మోదీజీ పాక్‌కి గుణపాఠం నేర్పించారు' అంటూ మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి విజయ్ షా వ్యాఖ్యానించారు. దీంతో దీనిపై సర్వత్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మంత్రిని వెంటనే సస్పెండ్ చేయాలి అంటూ.. కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ వ్యాఖ్యలను తప్పుబట్టారు. విజయ్ షా వ్యాఖ్యలు సిగ్గు చేటు అని ఆయన అన్నారు. దీంతో మధ్యప్రదేశ్ బిజెపి మంత్రిని పిలిచి చీవాట్లు పెట్టింది. అయితే దీనికి విజయ్ షా వివరణ ఇచ్చారు. ఉగ్రవాదుల చర్యలకు మనసు వికలమై.. అలా మాట్లాడానని అన్నారు. కులమతాలకు అతీతంగా సోషియా చేసిన సేవలకు సెల్యూట్ చేస్తున్నట్లు తెలిపారు. అంతేకానీ.. ఆమెను కించపరచాలనే ఆలోచన కలలో కూడా రాదని, తన మాటలు ఎవరినైనా నొప్పిస్తే.. పదిసార్లు క్షమాపణ చెప్తానని అన్నారు.

## గ్లోబల్ టైమ్స్, జిన్హువా ఎక్స్ ఖాతాలను నిలిపివేసిన భారత్




న్యూఢిల్లీ : నిరాధారమైన ఆరోపణలతో చైనా మీడియా సంస్థల ఎక్స్ ఖాతాలను భారత్ నిలిపివేసింది. చట్టపరమైన అభ్యర్థన మేరకు గ్లోబల్ టైమ్స్ మరియు జిన్హువా ఎక్స్ ఖాతాలు నిలిపివేయబడ్డాయని చైనా మీడియా బుధవారం పేర్కొంది. ఈ అంశంపై వివరణ కోరగా ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ స్పందించలేదు. గ్లోబల్ టైమ్స్, జిన్హువా న్యూస్ ఎక్స్ ఖాతాలను తెరిచినపుడు "ఖాతా నిలిపివేయబడింది" అనే మెసేజ్ స్క్రీన్‌పై కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా 8,000కు పైగా ఖాతాలను నిలిపివేయాల్సిందిగా ఎక్స్ సంస్థకు 2025 మే 8న భారత ప్రభుత్వం ఉత్తర్వులు పంపిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ వార్తా సంస్థలు మరియు ప్రముఖ ఎక్స్ వినియోగదారుల ఖాతాలకు భారత్‌లో అనుమతిని నిరోధించాలనే డిమాండ్ ఈ ఉత్తర్వుల్లో ఉంది. మే 7న పాకిస్తాన్ సైన్యం భారత యుద్ధ విమానాన్ని కూల్చివేసిందని చైనా మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్ నివేదించిందని చైనాలోని భారత రాయబార కార్యాలయం ఆరోపించింది.

# తక్షణం పార్లమెంట్



ఏప్రిల్ 22న పహల్గాంలో అమాయకులైన టూరిస్టులపై ఉగ్రదాడి, తదనంతరం మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో భారత పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తత తీవ్రమై యుద్ధ వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో శనివారంనాడు ఇరు దేశాల డిజిఎంఓలు కాల్పుల విరమణ ప్రకటన చేయడం సానుకూల పరిణామం. అయితే, ఆ ప్రకటన సిరా ఆరకమునుపే సరిహద్దు ప్రాంతాల్లో పాక్ కాల్పులకు పాల్పడడం, భారత దళాలు వాటిని తిప్పికొట్టడం వంటి చర్యలతో ఉద్రిక్తత కొనసాగుతూనే వుందని స్పష్టమవుతోంది. సోమవారంనాడు ఇరు దేశాల డిజిఎంఓల మధ్య చర్చలు జరిగినా అవి చాలా ప్రాథమికమైనవే. ఇవి మరింత ముందుకుపోయి సరిహద్దులో సంపూర్ణ శాంతియుత పరిస్థితులు ఏర్పడాలన్నది ప్రజల ఆకాంక్ష. అయితే, అటు పాకిస్థాన్‌లో ముస్లిం ఛాందస శక్తులు చెప్పినట్టు ఆడే ప్రభుత్వం, ఇటు భారత్‌లో హిందుత్వ శక్తుల నేతృత్వంలోని సర్కారు వున్న నేపథ్యంలో ఆ ఆకాంక్ష ఎంతవరకు నెరవేరుతుందో మరి! ఏది ఏమైనప్పటికీ అది ఏ రూపంలో వున్నా ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే! ఇరు దేశాలమధ్య కాల్పుల విరమణ ప్రకటన రావడానికి ముందే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ విషయాన్ని వెల్లడించడంతో కీలకమైన ద్వైపాక్షిక వివాదంలో అగ్ర రాజ్యం పెత్తనం బట్టబయలైంది. 'మధ్యవర్తిత్వం చేశాం. ఒక రాత్రంతా సుదీర్ఘ చర్చలు జరిపాం' అంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తుతుండగానే ఆదివారం మరో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా పోస్టులో ఆయన కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషిచేస్తానని పేర్కొనడం మరింత వివాదాస్పదంగా మారింది. ద్వైపాక్షిక అంశంలో అమెరికా జోక్యం అంతటా చర్చనీయాంశంగా మారింది. ఇంటా బయటా ఈ విషయమై విమర్శలు వెల్లువెత్తడంతో భారత ప్రభుత్వం నష్ట నివారణ చర్యలకు పూనుకున్నట్లు కనిపిస్తోంది. ఆదివారంనాడు సైనిక దళాల ప్రధానాధికారి (సిఒఎఎస్) సమీక్షించి, పాకిస్తాన్ ఒప్పంద ఉల్లంఘనలకు పాల్పడిన పక్షంలో తగిన చర్యలు తీసుకునేందుకు సైనిక కమాండర్లకు పూర్తి అధికారాలు అప్పగించారన్న ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ప్రధాని మోడీ ఆపరేషన్ సిందూర్‌తో పాటు పిఓకే అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారని ప్రభుత్వ వర్గాలు మీడియాకు తెలిపాయి. ఆ వర్గాలు చెప్పిన సమాచారం ప్రకారం 'అటు నుండి తుపాకి గుళ్లు వస్తే.. ఇటు నుండి మిసైల్స్ ప్రయోగించాలి అని మోడీ చెప్పారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ అంశంపై మధ్యవర్తులు అవసరం లేదు' అని అన్నారనీ, ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం మినహా పాకిస్తాన్‌కు మరో మార్గం లేదనీ ప్రధాని ఈ సమావేశంలో అన్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగిసి పోలేదు. పాక్ దాడికి దిగితే, భారత్ ఎదురు దాడి చేస్తుంది.' అని ఆయన అన్నారని మీడియాకు వెల్లడించారు. సోమవారం రాత్రి జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలోనూ గంభీర వచనాలే! ఇన్ని మాటలు చెప్పిన ప్రధాని లేదా భారత విదేశాంగ శాఖ అమెరికా జోక్యం గురించి స్పష్టం చేయకపోవడం వాస్తవాలను దాచిపెట్టడం, తద్వారా ప్రజలను వంచించడమే అవుతుంది. ఇప్పటికైనా భారత ప్రభుత్వం ఈ విషయంలో జరిగిందేమిటో ముఖ్యంగా అమెరికా పాత్ర ఏమిటో నిజాలు వెల్లడించాలి. భారత్ పాక్ మధ్య ద్వైపాక్షిక అంశాలను ఇరు దేశాలే పరిష్కరించుకుంటాం తప్ప మూడోవారి జోక్యాన్ని అనుమతించబోమని ఎన్నో దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానానికి కట్టుబడి వ్యవహరిస్తామని దేశ ప్రజలకు హామీనివ్వడం అవసరం. ఈనాడున్న విపత్కర పరిస్తితులపై దేశ ప్రజలందరికీ ఉమ్మడి అభిప్రాయం ఏర్పడడం అవసరం. అందుకు ప్రజాస్వామ్యంలో అత్యున్నత వేదిక పార్లమెంటు కనుక కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటు అత్యవసర సమావేశం నిర్వహించాలి. అన్ని విషయాలూ సమగ్రంగా చర్చించాలి. జమ్ము కాశ్మీర్‌తో సహా దేశ ప్రజలంతా ఉగ్రవాదాన్ని ఏకోన్ముఖంగా వ్యతిరేకించిన నేపథ్యంలో ఆ ఐక్యతను మరింత పెంపొందించే విధంగా ప్రభుత్వం వ్యవహరించాలి తప్ప స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చూడరాదన్నది ప్రజల ఆకాంక్ష.

# రిజర్వేషన్లపై కులగణన ప్రభావం



భారత దేశంలో బ్రిటిష్ పాలనా కాలం నుండే జనాభాను లెక్కించడం మొదలైంది. 1881లో మొదలైన జనగణన ప్రతి పదేళ్ళకోసారి లెక్కించడం జరుగుతున్నది. 1931 జనగణన వరకు కులాల వివరాల్ని కూడా సేకరించేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951లో జరిగిన జనగణన నుండి షెడ్యూల్డు కులాలు, తెగల వారిని మినహాయించి మిగిలిన కులాల వివరాల్ని నమోదు చేయడం లేదు. 2021 లో జరగాల్సిన జనగణన కరోనా మహమ్మారి వల్ల జరగలేదు. వివిధ రాష్ట్రాలో అసెంబ్లీ ఎన్నికలు, తదనంతరం లోక్‌సభ ఎన్నికలు జరగడంతో జనాభా లెక్కలు వాయిదా పడుతూ వచ్చాయి. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేయాలని కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అనూహ్యంగా జనాభా లెక్కలతోపాటు కులగణన కూడా చేయనున్నట్లు ప్రకటించింది. జనాభా లెక్కలు అనే అంశం భారత రాజ్యాంగంలోని కేంద్ర జాబితాలో పేర్కొనబడిన అంశం కాబట్టి కేంద్రమే సమగ్రంగా జనగణన చేస్తామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. భారత దేశమంటే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. వివిధ మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు ఎన్ని ఉన్నా మనమంతా భారతీయులమనే భావన ఇక్కడి ప్రజల్లో బలంగా ఉంటుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగే ఎనిమిదో జనగణన ఇది. దీంట్లో కులాలవారీగా వివరాల్ని సేకరించడం ద్వారా దేశంలో ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర ప్రాంత పాలిత ప్రాంతాల్లో ఆయా సామాజిక వర్గాల్లోని కులాల జనాభాతోపాటు వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో వారి వాటా కూడా తెలిసే అవకాశం ఉంటుంది. దేశంలో జనాభాను ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సామాజిక వర్గాలుగా వర్గీకరించారు. అయితే ఒక్కో కులం, ఒక్కో రాష్ట్రంలో, ఒక్కో వర్గంలో ఉంటుంది. వివిధ రాష్ట్రాల్లో ఆయా కులాల సామాజిక, ఆర్థిక వెనకబాటు ఆధారంగా ఈ విధంగా వర్గీకరించబడ్డాయని చెప్పవచ్చు. ఒక రాష్ట్రంలో ఒక సామాజిక వర్గం ఒసి జాబితాలో ఉంటే మరో రాష్ట్రంలో బిసి జాబితాలో చేర్చబడింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 1976 వరకు బిసి జాబితాలో ఉన్న కొన్ని కులాల్ని ఎస్‌టి జాబితాలోకి చేర్చడం జరిగింది. ఇప్పటికీ చాలా కులాలు తమను బిసి, ఎస్‌సి, ఎస్‌టిల జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలతోపాటు కులాల వారీగా వివరాల్ని సమగ్రంగా సేకరించడం వల్ల దేశవ్యాప్తంగా ఏయే కులాలు సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనకబాటుకు గురయ్యాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగే వీలుంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా కులగణన జరపాలని పెద్ద ఎత్తున కాంగ్రెస్ ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్ పరిమితిని తొలగిస్తామని కూడా చెప్తోంది. దేశవ్యాప్తంగా పౌరులందరికీ విద్య, ఉద్యోగావకాశాలతోపాటు, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కల్పించడం రిజర్వేషన్ ముఖ్య ఉద్దేశంగా చెప్పవచ్చు. 2011 జనగణన ప్రకారం దేశంలో ఎస్‌సి సామాజిక వర్గజనాభా 16.6% అయితే వారికి 15% రిజర్వేషన్, ఎస్‌టి జనాభా 8.6% అయితే వారికి 7.5% రిజర్వేషన్ అమలవుతుంది. ఒబిసి జాబితాలో ఉన్న వారికి 27% రిజర్వేషన్ అమలు అవుతుంది. అయితే ఒబిసి జనాభా ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. పేదరికానికి కులం, వర్గంతో సంబంధం లేదని 2019 లో కేంద్ర ప్రభుత్వం ఒసిల్లోని పేదల కోసం ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల రిజర్వేషన్ ప్రయోజనాలకు నష్టం వాటిల్లకుండా 103 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇడబ్ల్యుఎస్ చట్టం తీసుకువచ్చి 15(6), 16(6) ఆర్టికల్స్ ప్రకారం 10% రిజర్వేషన్‌ను కల్పించింది. దీంతో దేశంలోని ఒసి, బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల్లో అర్హులైన ప్రతి వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అవకాశం ఏర్పడింది. రిజర్వేషన్ అనే అంశం సమాజంలోని సామాజిక న్యాయం, సమానత్వం, చట్టపరమైన పరిమితుల మీద ఆధార పడి ఉంటుంది. ఈ అంశం పై భారత సుప్రీంకోర్టు 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 50% పరిమితిని నిర్దేశించింది. తెలంగాణలో కాంగ్రెస్ 2023 ఎన్నికల్లో బిసిలకు కామారెడ్డి డిక్లరేషన్‌లో 42% రిజర్వేషన్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా కులగణన నిర్వహించి రాష్ట్ర జనాభా 3.70 కోట్లని తెలిపింది. దేశంలో రిజర్వేషన్ పెంపు అంశం తెర మీదకు వచ్చినపుడు అందరికీ తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్ విధానం గుర్తుకు వస్తుంది. కానీ అక్కడ ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్‌లో చేర్చడం వల్ల న్యాయ సమీక్షకు అతీతంగా మారింది. 2007లో వచ్చిన ఐ.ఆర్ కోయల్హో కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ 9 వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉండరాదని, అవి న్యాయ సమీక్షకు అతీతం కావని పేర్కొంది. రిజర్వేషన్ పెంపు అంశం కేంద్ర పార్లమెంటు అధికార పరిధిలో రాజ్యాంగ సవరణతో ముడిపడి ఉంటుంది. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన కూడా నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఈ ప్రభావం రిజర్వేషన్ల పై ఏ విధంగా ఉండబోతుందో అన్నదానికి కాలమే సమాధానం చెప్తుంది.




# వాణిజ్యమే ట్రంప్ కార్డ్!



మొత్తానికి భారత్- పాకిస్తాన్ ఘర్షణకు తెరదించిన ఘనతను అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ తన ఖాతాలో వేసుకున్నారు. 'ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించింది. సరైన సమయంలో విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించినందుకు రెండు దేశాలకూ ధన్యవాదాలు' అంటూ తన ట్రూత్ సోషల్‌లో ట్రంప్ చేసిన పోస్ట్ సభ్యదేశాలనే కాదు, మన దేశంలోని రాజకీయ పక్షాలను కూడా ఆశ్చర్యంలో ముంచెత్తింది. భారత్- పాకిస్తాన్ ఘర్షణలో తలదూర్చబోమంటూ కాల్పుల విరమణకు సరిగ్గా రెండు రోజుల ముందు అమెరికా ఉపాధ్యక్షుడు స్వయంగా చేసిన ప్రకటన ఏ గాలికి కొట్టుకుపోయిందో తెలియదు. ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే అమెరికా విదేశాంగ మంత్రి సైతం తాము ఇరు దేశాల ప్రధానులతోను, జాతీయ భద్రతా సలహాదారులతోనూ చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. ఉద్రిక్తతలకు తెరదించని పక్షంలో ఇరు దేశాలతో వాణిజ్యం నిలిపేస్తానంటూ తాను తేల్చిచెప్పడంతోనే అవి దిగివచ్చాయని, వాణిజ్యాన్ని తాను వాడినట్లుగా ఇతరులెవరూ వాడలేదని ట్రంప్ చెప్పుకున్నారు. నిజమే, వియ్యానికైనా, కయ్యానికైనా వాణిజ్యమే ఆయనకు ట్రంప్ కార్డు. ఇప్పుడు అదే కార్డును ఉపయోగించి, భారత్- పాక్‌లతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోబోతున్నారు. స్వదేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆయన సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నారు. సుంకాల కొరడా ఝుళిపించి, అనేక దేశాలను వాణిజ్య చర్చలకు రప్పించేలా చేయగలిగారు. రష్యాతో యుద్ధానికి కాలు దువ్వెందంటూ ఉక్రెయిన్‌ను తప్పుబట్టి, ఇప్పటివరకూ అమెరికా అందిస్తున్న సహాయాన్ని నిలిపివేస్తామంటూ బెదిరించి, ఆ దేశంలో అరుదైన ఖనిజాల తవ్వకాన్ని గుత్తకు తీసుకున్నారు. కాల్పుల విరమణ తమకు అంగీకారమేనంటూ రష్యా- ఉక్రెయిన్ చేసిన తాజా ప్రకటన దరిమిలా, ఈ ఘనత కూడా ట్రంప్ ఖాతాలోనే పడటం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే, రష్యాతోనూ ఆయన నేరుగా వాణిజ్య ఒప్పందాలకు ఎగబడతారనడంలో సందేహం లేదు. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు అధికార పగ్గాలు చేపట్టిందే తడవు దేశదేశాలనూ బెదిరించి మరీ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం పనిగా పెట్టుకున్న ట్రంప్ మహాశయుడు చైనా కొమ్ములు మాత్రం వంచలేకపోయారు. దాంతో బతిమాలి, బుజ్జగించి బీజింగ్‌ను దారికి తెచ్చుకున్నట్లు తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. పోటాపోటీగా విధించుకున్న సుంకాలను తగ్గించుకునేందుకు ఇరుదేశాల మధ్య స్విట్జర్లాండ్ వేదికగా అంగీకారం కుదరడానికి ట్రంప్ ఓ మెట్టు దిగిరావడమే కారణం. రేపోమాపో ఇరాన్‌తోనూ ఇదే విధంగా ఆయన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకున్నా ఆశ్చర్యపోనక్కరలేదు. అణు ఒప్పందానికి తలొగ్గాలని, లేనిపక్షంలో ఏకాకిని చేసి, ఏ సహాయమూ అందకుండా చేస్తామంటూ ఆ దేశాన్ని దారికి తెచ్చుకునేందుకు అమెరికా కుయుక్తులు పన్నుతోంది. విచిత్రమేమంటే, ఈ ఘర్షణలో ట్రంప్ మహాశయుడు భారత్‌తో సమానంగా పాకిస్తాన్‌ను చూడటం. ఉగ్రవాదానికి పాకిస్తాన్ పాలుపోసి పెంచిందన్న నగ్నసత్యం ఆయనకు తెలియనిదేమీ కాదు. ట్విన్ టవర్స్‌పై దాడికి మూలకారకుడైన ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయమిచ్చి ఆదుకున్నది దాయాది దేశమే. పాకిస్తాన్‌లో శిక్షణ పొందిన ఉగ్రవాదులు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారన్నది చేదు నిజం. పహల్గాంలో అమాయక ప్రజల ప్రాణాలు తీసింది కూడా పాక్ ఉగ్రవాదులే. ఇవన్నీ తెలిసినా ప్రస్తుత ఘర్షణలో భారత్‌కు ఎంత ప్రాధాన్యమిచ్చారో అంతే ప్రాధాన్యాన్ని పాకిస్తాన్‌కూ ఇవ్వడం వెనుక కారణాలు వేరు. క్రమక్రమంగా చైనా గుప్పిట్లోకి వెళ్లిపోతున్న దాయాది దేశాన్ని మళ్లీ తన అధీనంలోకి తెచ్చుకోవడం, వీలైతే అప్పులిచ్చి 'ఆదుకోవడం' ఆయన ప్రధాన వ్యూహంగా కనబడుతున్నది. భారత్ వద్దు వద్దంటున్నా పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజాగా బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం చేయడం వెనుక అమెరికా హస్తం ఉందన్న వార్తలు కూడా వినవస్తున్నాయి. ఇది చాలదన్నట్లు కశ్మీర్ విషయంలోనూ మధ్యవర్తిత్వం నెరిపేందుకు ట్రంప్ ఉత్సాహపడుతున్నారు. ఇరుదేశాలకు చెందిన ఈ వివాదంలో ఇతరుల జోక్యం సహించేది లేదంటూ భారత్ పదేపదే తెగేసి చెబుతున్నా, పట్టించుకోకపోవడం ట్రంప్ తెంపరితనానికి నిదర్శనం. ఒకప్పటిలా పాకిస్తాన్‌తో అంటకాగాలని అగ్రరాజ్యం ఆశిస్తే, ఆసియాలో ప్రబల ఆర్థిక శక్తిగా చైనాకు పోటీగా ఎదుగుతున్న భారత్‌ను దూరం చేసుకున్నట్లే. అదే జరిగితే చైనాను దీటుగా ఎదుర్కొనేందుకు ఆసియాలో పాగా వేయాలన్న అమెరికా కల నెరవేరడం జరగని పని.

# మహిళలు రాఫెల్‌ను నడిపినపుడు.. ఆ పోస్టులు ఎందుకు కేటాయించరు



న్యూఢిల్లీ : భారత వైమానిక దళంలో మహిళలు రాఫెల్ యుద్ధ విమానాన్ని నడపగలిగినపుడు, వారిని ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ (లీగల్) పోస్టుల్లో ఎందుకు తీసుకోవడం లేదని సుప్రీంకోర్టు బుధవారం కేంద్రాన్ని నిలదీసింది. ఈ పోస్టుల్లో మహిళలు తక్కువగా ఉండటంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ పోస్టులకు 50-50 నిబంధన వర్తించినప్పటికీ మహిళలను ఎందుకు నియమించలేదని ప్రశ్నించింది. ఇద్దరు మహిళా అధికారులు అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగిలు దాఖలు చేసిన పిటిషన్‌పై మే 8న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం తమ తీర్పును రిజర్వ్ చేసింది. ఆ ఇద్దరు అధికారులు ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షల్లో వరుసగా 4,5 ర్యాంకులు సాధించారు. పురుషుల కన్నా మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ, మహిళలకు కేటాయించిన ఖాళీలు తక్కువగా ఉండటం వలన జెఎజి విభాగానికి తమను ఎంపిక చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. మహిళలు మరియు పురుషులకు అసమానంగా ఉన్న ఖాళీలను ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. మొత్త ఆరు పోస్టుల్లో మహిళలకు మూడు ఖాళీలు మాత్రమే ఉన్నందున వారిని ఎంపిక చేయలేమని అధికారులు చెప్పారని అన్నారు. భారత వైమానిక దళంలో ఒక మహిళ రాఫెల్ యుద్ధ విమానం నడపడానికి అనుమతి ఉంటే, జెఎజిలో ఎక్కువ మంది మహిళలను అనుమతించడం ఆర్మీకి కష్టం ఏముందని కేంద్రాన్ని ప్రశ్నించింది. లింగబేధంతో సంబంధం లేకుండా తటస్థ పోస్టులైనప్పటికీ.. మహిళలకు ఎందుకు తక్కువ పోస్టులు కేటాయించారని ప్రశ్నించింది. పురుషులు-మహిళలు ఆధారంగా ఖాళీలను విభజిచడం వలన అధిక అర్హత కలిగిన మహిళా అభ్యర్థులను తీసుకోనపుడు.. పోస్టులను లింగ తటస్థ పోస్టులను ఎందుకు పిలుస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. 10మంది మహిళలు జెఎజికి అర్హత సాధిస్తే..వారందరినీ జెఎజి బ్రాంచ్ అధికారులుగా నియమిస్తారా అని జస్టిస్ మన్మోహన్ ప్రశ్నించారు.

## తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు



అమరావతి : రెండు తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నట్లు వాతావరణశాఖ పేర్కొంది. ఉత్తర దక్షిణ ద్రోణి ప్రభావంతో ఉపరితల చక్రవాక ఆవర్తనాల ప్రభావంతో తెలంగాణలో వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, పశ్చిమ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు వాతావరణశాఖాధికారి ధర్మరాజు తెలిపారు. రుతుపవనాల ఆగమనంతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో వర్షాలు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల ఎండల ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 14న అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, వైఎస్ఆర్, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అంబేద్కర్ కోనసీమ, పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయి ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ : భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి ప్రమాణస్వీకారం చేశారు. బుధవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో సిజెఐగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సిజెఐ గవాయిని రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు కేంద్ర మంత్రివర్గంలోని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి మాజీ చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ గవాయికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సిజెఐగా జస్టిస్ గవాయి ఆరునెలల పాటు పదవిలో కొనసాగుతారు. ఈ ఏడాది నవంబర్‌లో ఆయన పదవీవిరమణ చేయనున్నారు. బాంబే హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఆయన 1985లో బార్‌లో చేరారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2005లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

## యుపిఎస్సీ ఛైర్మన్‌గా మాజీ రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్



ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్సీ) ఛైర్మన్‌గా మాజీ రక్షణ కార్యదర్శి అజయ్ కుమార్‌ను నియమిస్తూ కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 29న ప్రీతి సుడాన్ పదవీకాలం ముగియడంతో యుపిఎస్సీ ఛైర్మన్ పదవి ఖాళీ కానుంది. ఈ పదవికి అజయ్ కుమార్ నియామకాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదించినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. కేరళ కేడర్‌కు చెందిన 1985 బ్యాచ్ రిటైర్డ్ ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఎఎస్) అధికారి అయిన అజయ్ కుమార్ 2019 ఆగస్టు 23 నుండి 2022 అక్టోబర్ 31 వరకు రక్షణ కార్యదర్శిగా పనిచేశారు. ఐఎఎస్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) వంటి వాటికి అధికారులను ఎంపిక చేయడానికి యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలను నిర్వహిస్తుంది. దీనికి ఒక ఛైర్మన్ నాయకత్వం వహిస్తారు. దీనిలో గరిష్టంగా 10 మంది సభ్యులు ఉండవచ్చు. ప్రస్తుతం కమిషన్‌లో ఇద్దరు సభ్యుల పదవులు ఖాళీగా ఉన్నాయి. యుపిఎస్సీ ఛైర్మన్‌ను పదవీకాలం ఆరు సంవత్సరాలు.

# యుద్ధ రీతిని సమూలంగా మార్చిన డ్రోన్లు

**దడ పుట్టించే 'డ్రోణా'స్త్రం**
**సైనిక సంపదలో కీలకంగా ఈ ఆధునిక వ్యవస్థ**
**ఆపరేషన్ సిందూర్ తోసత్తా చాటిన భారత్**
**డ్రోన్స్ తయారీలోదిగ్గజ కంపెనీలు నిమగ్నం**
**మేము సైతం అంటున్న హైదరాబాద్ సంస్థలు**



హైదరాబాద్: రాజుల కాలంలో కత్తులు, బల్లేలతో సైనికులు రణక్షేత్రంలో పోరాడారు. తరవాత.. యుద్ధ భూమిలో తుపాకులు, బాంబుల మోత మోగింది. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక మానవ రహిత విమానాలు, క్షిపణులతో విరుచుకుపడుతున్నారు. ఇప్పుడు.. ఏకంగా వేల మైళ్ల దూరం నుంచే శత్రుదేశంపై దాడులు చేస్తూ మారణహోమం సృష్టిస్తున్నారు. ఇజ్రాయెల్-హమాస్, రష్యా-ఉక్రెయిన్.. తాజాగా భారత్-పాక్... యుద్ధం ఏదైనా.. డ్రోన్స్ (మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీ)) ఇప్పుడు సైనిక సంపదలో అత్యంత కీలకంగా మారాయి. పెళ్లిళ్ల వంటి వేడుకల్లో ఫొటోలూ, వీడియోలూ తీసే డ్రోన్స్ మాత్రమే చాలా మందికి సుపరిచితం. కానీ, డ్రోన్స్ అంటే అంతకుమించి. డ్రోన్లు అధునాతన ఆయుధాలు. ఎవ్వరూ ప్రాణాలను పణంగా పెట్టకుండానే కచ్చితమైన దాడులు చేయడం, వేగంగా మోహరించే సామర్థ్యం వీటి సొంతం. క్షిపణులతో పోలిస్తే వీటి అభివృద్ధికి అయ్యే వ్యయమూ తక్కువే.

### మన దేశంలో డ్రోన్ల వాడకం..

1999లో కార్గిల్ యుద్ధంలో మన సైన్యం తొలిసారి యూఏవీలను వినియోగించింది. ఆ తర్వాత ఇండియా అధికారికంగా వీటి కొనుగోలు మొదలు పెట్టింది. ప్రస్తుతం మన సైన్యం వద్ద ఇజ్రాయిల్ నుంచి దిగుమతి చేసుకున్న సెర్చర్ ఎంకే%-%2 టాక్టికల్ డ్రోన్స్, హెరాన్‌మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ (ఎంఎఎల్ఈ), హార్పీ యాంటీ రాడార్ డ్రోన్లు ఉన్నాయి. హార్పీ అనేది ఆత్మాహుతి డ్రోన్(లాహోర్ వైమానిక రక్షణ వ్యవస్థను కూల్చివేసే క్రమంలో దీన్ని వినియోగించారు). వీటితో పాటు హరోప్ లాయిటరింగ్ అటాక్ డ్రోన్స్ కూడా ఉన్నాయి. రాడార్ సైట్లు, వాహనాలే లక్ష్యంగా మందుగుండుతో ఢీకొట్టి సర్వనాశనం చేయడం దీని స్పెషాలిటీ. దీంతో పాటు అధిక మన్నిక, పేలోడ్ సామర్థ్యం కలిగిన ఇజ్రాయిల్ ఎంఏఎల్ఈ డ్రోన్'హెరాన్‌టీపీ/మార్క్ 2'కూడా మన దగ్గర ఉంది.

### మొదటి ప్రపంచ యుద్ధంలో..

మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, అమెరికా రెండూ తొలిసారిగా యూఏవీతో ప్రయోగాలు చేశాయి. 1950-60లలో శత్రు భూభాగంపై గూఢచర్యం చేయడానికి యూఎస్ చిన్న రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్లు ఉపయోగించింది. వియత్నాం యుద్ధంలో నిఘా యూఏవీలు తొలిసారిగా మోహరించారు. 2000వ సంవత్సరంలో అమెరికా హెల్‌ఫైర్ క్షిపణులతో కూడిన ప్రిడేటర్ డ్రోన్‌ను రూపొందించింది. ఇక్కడి నుంచే సైనిక ఆయుధ భాండాగారంలోపెనుమార్పులు వచ్చాయి. మగ తేనెటీగను ఇంగ్లీషులో డ్రోన్ అంటారు. శ్రామిక తేనెటీగలకన్నాఇవి పెద్దగానే ఉంటాయి. కానీ తేనెనూ సంపాదించలేవు. తమను తామూపోషించుకోలేవు. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఇవి చేసే పని ఏమీ ఉండదు. కానీ, ఆడ తేనెటీగ కోసం వెతుకుతూ ఎగిరి, దాన్ని కలిశాక పడిపోతుంది. డ్రోన్ మాత్రం అలాకాదు.. చూసి రమ్మంటే కాల్చి వస్తుంది.

### హైదరాబాద్ నుంచి..

రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో ఇప్పటికే నిలిచింది. డిఫెన్స్ డ్రోన్‌విభాగంలోనూ ఇదే బాటలో పయనిస్తోంది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్.. భారత రక్షణ శాఖ కోసం ఏఎల్ఎస్-250 యూఏవీలను ఉత్పత్తి చేస్తోంది. అదానీ-ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా.. హెర్మీస్ 900 యూఏవీలను తయారు చేస్తోంది. రక్షణ రంగానికి కావాల్సిన కీలక యంత్ర, పరికరాల తయారీలో ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన హైదరాబాద్ సంస్థ ఎస్ఈసీ ఇండస్ట్రీస్‌కు చెందిన ట్రిన్నోవేట్ సినర్జీ టెక్నాలజీస్ చిన్న యూఏవీలు, హైబ్రిడ్ డ్రోన్స్ సరఫరా చేస్తోంది. ఆయుధాలను మోసే యూఏవీలను ఇండియన్ ఆర్మీకి అందిస్తోంది. జెన్ టెక్నాలజీస్ చిన్న యూఏవీలను భారత రక్షణ విభాగాలకు సరఫరా చేస్తోంది. ఎస్ఈసీ డీఆర్‌వీఏఎన్‌ఇన్నోవేషన్స్.. మిలిటరీ టెస్టింగ్ కోసం టార్గెట్ డ్రోన్లనుబీ శిక్షణ, మదింపు కోసం శత్రు డ్రోన్లను అనుకరించే యూఏవీలను ఆఫర్ చేస్తోంది. మారుత్ డ్రోన్స్ రక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా డ్రోన్లను అభివృద్ధి చేస్తోంది. టీ-హబ్, టీ-వర్క్స్ కేంద్రంగా కొన్ని స్టార్టప్స్ ఈ సెగ్మెంట్లోకి రానున్నాయి. భారత్ ఎలక్ట్రికల్స్ - హిందూస్థాన్ ఏరోనాటిక్స్ తయారీ భాగస్వాములుగా డీఆర్‌డీఓ రుస్తోమ్ - 2 డ్రోన్స్ అభివృద్ధి చేసింది. దక్ష యూఏవీ, ఐడియా ఫోర్జ్ వంటివి కూడా హైదరాబాద్ నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నాయి.

### 2030 నాటికి రూ.34,860 కోట్లకు..

డ్రోన్స్, యూఏవీల తయారీలో 75% వరకు విడి భాగాలు దేశీయంగా ఉత్పత్తి అయినవే. కొన్ని నెలల్లో ఇది 100 శాతానికి చేరడం ఖాయమని పరిశ్రమ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. డిఫెన్స్ డ్రోన్‌కంపెనీలు పరిశోధన, అభివృద్ధి, తయారీకి ఇప్పటికే రూ. 2,000 కోట్ల పెట్టుబడి పెట్టాయి. పరిశ్రమకు రూ. 1,000 కోట్ల ప్రోత్సాహకాలను ప్రభుత్వం త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. భారత సైనిక డ్రోన్ మార్కెట్ 2024లో రూ. 13,040 కోట్లు. 2030 నాటికి ఇది రూ. 34,860 కోట్లకు చేరుతుందని గ్రాండ్ వ్యూ రిసర్చ్ అంచనా.

# ఇంజనీరింగ్ కోర్ గ్రూపులకు ఆదరణ తగ్గడంపై సర్కారు దృష్టి

**త్వరలో కాలేజీల నిర్వాహకులు, అధికారులతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం**
**ఈ ఏడాది నుంచి కోర్ గ్రూపుల సిలబస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్**
**అంతా సీఎస్ఈ వైపే మొగ్గుతుండటంతో తగ్గుతున్న కోర్ సీట్లు, చేరికలు**



హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో కోర్ గ్రూపులకు రానురాను ఆదరణ తగ్గుతోంది. కంప్యూటర్ సీట్లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో.. ప్రతి ఏటా కోర్ గ్రూపుల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో కాలేజీలు వాటిని తగ్గించుకునేందుకే మొగ్గుచూపుతున్నాయి. గత ఏడాది వందకు పైగా కాలేజీలు సివిల్, మెకానికల్, ఈఈఈ బ్రాంచీల్లో సీట్లు తగ్గించాలని దరఖాస్తులు పెట్టుకున్నాయి. ఈ ఏడాది కూడా పరిస్థితి ఇలాగే ఉంది. దీనిపై ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారులు సమీక్షించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి సమగ్ర నివేదిక కోరారు. ఇంజనీరింగ్ విద్యలో సమతుల్యత అవసరమని భావిస్తున్న అధికారులు.. కోర్ గ్రూపులను కాపాడేందుకు త్వరలో ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల నిర్వాహకులు, ఉన్నత విద్యా మండలి అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే దిద్దుబాటు చర్యలపై దృష్టి పెట్టాలనే ఆలోచనలో ఉన్నారు.

### తగ్గుతున్న చేరికలు

సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఈఈఈ కోర్సుల్లో 2019లో 43,532 సీట్లు ఉంటే 25,823 సీట్లు భర్తీ అయ్యాయి. 2024 సంవత్సరానికి వచ్చేసరికి అంటే ఐదేళ్లలో సీట్లు 25,597కు పడిపోయాయి. 19,739 చేరికలు మాత్రమే నమోదయ్యాయి. మరోవైపు కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో గడచిన ఆరేళ్ళలో 280 శాతం మేర ప్రవేశాలు పెరిగాయి. సీట్లు కూడా భారీగానే పెరిగాయి. 2019లో కన్వీనర్ కోటా కింద 22,033 సీఎస్ఈ సీట్లు ఉంటే 20,311 సీట్లు భర్తీ అయ్యాయి. 2024లో సీట్లు 61,587కు పెరగగా ఏకంగా 59,485 సీట్లు భర్తీ అయ్యాయి.

### స్లైడింగ్‌లో మార్పుతోనూ కోర్‌కు నష్టం

ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి గత ఏడాది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా కోర్ గ్రూపులను మరింత దెబ్బతీసిందని నిపుణులు అంటున్నారు. కన్వీనర్ కోటా కింద ఏదైనా కాలేజీలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆఖరి సమయంలో ఐఐటీ, ఎన్ఐటీల్లోనో, డీమ్డ్, ఇతర రాష్ట్రాల కాలేజీల్లోనో చేరుతుంటారు. దీంతో ఖాళీ అయ్యే సీట్లను కాలేజీలు బయటి విద్యార్థులతో భర్తీ చేసేవి. అయితే గత ఏడాది స్లైడింగ్ విధానాన్ని నిర్వహించిన సాంకేతిక విద్య విభాగం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కాలేజీలకు కలిపి స్లైడింగ్ నిర్వహించ లేదు. ఏ కాలేజీకి ఆ కాలేజీలో మాత్రమే స్లైడింగ్‌కు అవకాశం ఇచ్చింది. ఇది కోర్ గ్రూపులను మరింత దెబ్బతీసింది. 40 వేల ర్యాంకు వచ్చిన వ్యక్తి ఒక కాలేజీలో సివిల్ గ్రూపులో సీటు పొందితే, స్లైడింగ్‌లో ఆ వ్యక్తి సీఎస్ఈ సీటు తెచ్చుకున్నాడు. కానీ 10 వేల లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థి కంప్యూటర్ కోర్సు మాత్రమే కోరుకున్నా, ఆ కాలేజీలో బ్రాంచి లేకపోవడం వల్ల సీటు పొందలేని స్థితి ఏర్పడింది. ఈ విధంగా గత ఏడాది దాదాపు 5,500 మంది విద్యార్థులు నష్టపోయినట్టు అధికారులు చెబుతున్నారు. గతంలో కోర్ బ్రాంచీల్లో చేరిన వారిని అలాగే ఉంచి, కొత్తవారికి అవకాశం ఇచ్చేవారు. దీనివల్ల కోర్ గ్రూపులో చేరినవారు అలాగే ఉండేవారు. దీనిపై పలువురు విద్యావేత్తల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నత విద్య అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు ఇటీవలి కాలంలో కోర్ గ్రూపుల సిలబస్‌లో మార్పులు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాప్టర్లను కూడా చేరుస్తున్నారు. దీనివల్ల కోర్‌కు ఆదరణ పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# వెనక్కి తగ్గిన అమెరికా - చైనా



వేలంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది. ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది. ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హె లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది. గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా-చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి. అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి. చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి. వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి. ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది. ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి. ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు. అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, ముున్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం. నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు. సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస. ఏదైనా అనుభవంలోకొస్తే తప్ప తత్వం బోధపడదు. మొత్తానికి ఈ చర్చల వల్ల ఇప్పటికైతే అర్థవంతమైన పరిష్కారం లభించలేదు. ముున్ముందు ఏమవుతుందన్నది రెండు దేశాల విజ్ఞతకూ పరీక్ష.

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com